RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8
సంచిక (Issue) : 292 వెల - రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

ఆదివారం 05, మార్చి 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,




## కన్నుల పండువగా
# ధర్మపురీశుల కళ్యాణం



(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి మార్చి 04 (ప్రజా మంటలు): దక్షిణ కాశీగా, హరిహర క్షేత్రంగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమై నదిగా, రాష్ట్రంలో పేరెన్నికగన్న గోదావరీ తీరస్థ పుణ్య తీర్థమైన ధర్మపురి క్షేత్రంలో, శని వారం రాత్రి శ్రీయోగానంద, ఉగ్ర లక్ష్మీ నారసింహ వేంకటేశ్వర స్వాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు వైభవోపేతంగా, కన్నుల పండువగా జరిగాయి. స్థానిక దైవాల బ్రహ్మోత్సవాలలో

మిగతా... 2లో

## బుల్లెట్ కన్నా
# బ్యాలెట్ పవర్‌ఫుల్



**కుల రాజకీయాలను దూరం పెట్టాలి**

**చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో వెంకయ్యనాయుడు**

హన్మకొండ,మార్చి4(ప్రజా మంటలు): బుల్లెట్ కంటే బ్యాలెట్ పవర్ ఫుల్ అని మాజీ ఉపరాష్ట్ర పతి వెంకయ్య నాయుడు చెప్పారు. రాజకీయ నాయకుల పట్ల ప్రజలలో గౌరవం, విశ్వాసం తగ్గుతోందన్న ఆయన.. ప్రజా సమస్యల పట్ల చర్చ జరగాల్సిన చట్టసభలు యుద్ధ భూములుగా మారుతున్నాయని ఆరోపించారు. హన్మకొండలో చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ 11వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు పట్టాలు అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంగ్లీషు బాష నేర్చుకోవాలి తప్పు కాదు.. కానీ ఆంగ్ల సాంస్కృతులు మాత్రం నేర్చుకోవద్దని

మిగతా... 2లో

## దేశవ్యాప్తంగా
# వైరల్ వ్యాధులు



**దగ్గు, జలుబు, జ్వరం కేసులు**

**అదేపనిగా యాంటీబయాటిక్స్ వాడొద్దు**

**వైద్యులకు ఐఎంఎ సూచనలు**

న్యూఢిల్లీ,మార్చి4(ప్రజా మంటలు): వైరస్ కారణంగా ప్రస్తుతం దేశవ్యాప్తంగా సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలిపింది. జలుబు, జ్వరం, దగ్గు వంటి సీజనల్ వ్యాధులకు యాంటీబయాటిక్స్ ఔషధాలు తీసుకోవడం సరికాదని పేర్కొంది. ఈ మేరకు సీజనల్ వ్యాధులకు యాంటీబయాటిక్స్ మందులు ఇవ్వొద్దని దేశవ్యాప్తంగా ఉన్న వైద్యులు, వైద్య నిపుణులకు ఐఎంఏ సూచించింది. ఈ మేరకు ఐఎంఏ స్టాండింగ్ కమిటీ ఆదేశాలు జారీ చేసింది. ఐఎంఏ జారీ చేసిన ఆదేశాల మేరకు.. జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, వికారం, వాంతులు, జ్వరం ఇవన్నీ సాధారణమేనని పేర్కొంది. సీజనల్ జ్వరం ఐదు నుంచి ఏడు రోజుల వరకు ఉంటుందని తెలిపింది. సాధారణ జ్వరం మూడు రోజుల్లో తగ్గిపోతుందని చెప్పింది. అయితే దగ్గు మాత్రం మూడు వారాల వరకు ఉంటుందని నోటీసుల్లో పేర్కొంది. రోగులకు యాంటీ బయాటిక్స్ ఔషధాలు సూచించే ముందు సదరు ఇన్ఫెక్షన్ బ్యాక్టీరియా వల్ల వచ్చిందా? కాదా? అన్నది వైద్యులు నిర్ధారించుకోవాలని సూచించింది. లక్షణాల ఆధారంగా చికిత్స ఇవ్వాలని పేర్కొంది. ఈ దగ్గు, జలుబు వంటి వాటికి యాంటీబయాటిక్స్ అవసరం లేదని స్పష్టం చేసింది. 'ప్రజలు ఇప్పుడు అజిత్రోమైసిన్, ఆమోక్సిసిలిన్ వంటి యాంటీబయాటిక్స్ ఔషధాలను తీసుకుంటున్నారు. ఈ విషయంలో తగిన జాగ్రత్తలు అవసరం. కొంచెం తగ్గినట్టు అనిపించగానే వాటిని ఆపేయాలి. లేదంటే యాంటీబయాటిక్ రెసిస్టెన్స్‌కు దారితీస్తుంది. యాంటీబయాటిక్స్ అవసరం ఏర్పడినప్పుడు అవి సమర్థవంతంగా పనిచేయవు' అని ఐఎంఏ తెలిపింది. అయితే సంబంధిత లక్షణాలు లేనప్పటికీ వైద్యులు ఎక్కువగా యాంటీబయాటిక్స్ సూచిస్తుండటాన్ని ఐఎంఏ తప్పుబట్టింది. డయేరియాకు కూడా వైద్యులు యాంటీబయాటిక్స్‌నే ఇస్తున్నారని తెలిపింది. 70 శాతం డయేరియా కేసులు వైరల్ వల్ల వస్తున్నవని పేర్కొంది. అమోక్సిసిల్లిన్, నార్ ఫ్లాక్సాసిల్లిన్, సిప్రోఎలాక్సాసిల్లిన్, ఓఎ÷-లాక్సాసిల్లిన్, లెవోఎలాక్సాసిల్లిన్.. వీటిని దుర్వినియోగం చేస్తున్నట్టు ప్రస్తావించింది. వైరల్ వల్ల వచ్చే ఇన్ఫెక్షన్లకు యాంటీబయాటిక్స్ పనిచేయవని పేర్కొంది. ఇందు కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. సంక్రమణ నివారణకు స్వీయ నియంత్రణను పాటించాలని ప్రజలకు సూచించింది. రద్దీగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండాలని, పరిశుభ్రతను పాటించాలని ఐఎంఏ తన నోటీసుల్లో సూచించింది.

# గుండెపోటు

**గుండెపోటుతో కుప్పకూలుతున్న జనం**

**ఆందోళన కలిగిస్తున్న వరుస ఘటనలు**

**పెద్దపల్లిలో కాంగ్రెస్ నేత, బాపట్లలో టీచర్ మృతి**

హైదరాబాద్,మార్చి4(ప్రజా మంటలు): వయసుతో సంబంధం లేకుండా గుండెపోటుతో చనిపోతున్నవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పూర్తి ఆరోగ్యంగా ఉన్నవారుకూడా ఉన్నట్టుండి కుప్పకూలిపోతున్నారు. అప్పటివరకు బాగున్నవారు గుండెపోటుతో చనిపోతున్నారు. ఎప్పుడు, ఎవరికి ఏం జరుగుతుందోనని అంతా ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం మేడ్చల్‌లోని సీఎంఆర్ ఇంజినీరింగ్

మిగతా... 2లో



## దేశాభివృద్ధి ప్రక్రియలో
# మౌలిక సదుపాయాలే కీలకం

**వీటి అభివృద్ధికి అధికా ప్రాధాన్యం ఇస్తున్నాం**

**రాబోయే కాలంలో రూ. 110 లక్షల కోట్లు పెట్టుబడుల లక్ష్యం**

**రవాణా రహదారులు, వాణిజ్య పరిశ్రమల**

**వెబినార్‌లో ప్రధాని నరేంద్రమోడీ**



న్యూఢిల్లీ,మార్చి4(ప్రజా మంటలు): దేశాభివృద్ధి ప్రక్రియలో మౌలిక సదుపాయాల అభివృద్ధి ముఖ్యమైన పాత్ర వహిస్తుందని ప్రధాని నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. రోడ్డు, రవాణా రహదారుల మంత్రిత్వశాఖ, వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖ కలిసి నిర్వహించిన వెబినార్‌లో ప్రధాని నరేంద్రమోడీ శనివారం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఈ ఏడాది బడ్జెట్ మౌలిక సదుపాయాల రంగానికి కొత్త వృద్ధి శక్తినిస్తుంది. దేశాభివృద్ధి ప్రక్రియలో

మిగతా... 2లో

# కాళేశ్వరంలో లక్షకోట్ల అవినీతి

**చుక్క నీరు పారకున్నా నిధుల దుబారా**

**కాంగ్రెస్ సృష్టించిన సంపదను అమ్ముకుంటున్న కెసిఆర్**

**మీడియా సమావేశంలో సిఎల్పీ నేత భట్టి విమర్శలు**




హైదరాబాద్,మార్చి4(ప్రజా మంటలు): కాళేశ్వరం కట్టి లక్ష కోట్లు తిన్నా కానీ.. ప్రాజెక్టు నుంచి చుక్క నీరు పారలేదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణానదిపై పాలమూరు తప్ప ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టలేదన్నారు. గాంధీభవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మాణిక్ రావు ఠాక్రే అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టుల వల్లే తెలం గాణలో 24 గంటల విద్యుత్ సాధ్యమవుతోందని భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ తవ్విన కాల్వ ల్లోనే బీఆర్ఎస్ సర్కార్ నీళ్లిస్తోందని విమర్శిం చారు. కాంగ్రెస్ సృష్టించిన సంపదతోనే హైదరాబాద్‌లో

మిగతా... 2లో

## కప్పుకున్న కొత్త పార్టీ కండువా
# కంటి తుడుపుగానే ఉంటుంది

- రాజకీయ ఆశావహుల శోకతప్త హృదయం...?
- రాజకీయ ఆశావహులకు తెలంగాణాలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలు అసలు ప్రత్యామ్నాయమా...?



హైదరాబాద్,మార్చి4(ప్రజా మంటలు): ప్రస్తుతం దేశ వ్యాప్తంగా రాజకీయ రంగంలో నాయకులు పార్టీల మార్పులు, చేర్పులు, జంపింగ్ జపాంగ్ లు సర్వసాధారణ పరిస్థితి. పార్టీల అసంతృప్తులు పార్టీని వీడడానికి వారి వారి ఆత్మ గౌరవం, పార్టీపై ఉన్న నిబద్ధతపై దగా, సామాజిక అన్యాయంలాంటి పదాలు వాడుతున్నప్పటికిని ప్రజల్లో సానుభూతి పొందలేని దుర్భర స్థితి నెలకొంటున్నాయి అనేది రాజకీయ పార్టీలో ఉన్న

మిగతా... 2లో

## ప్రజానాడి






## 9 మంది చిన్నారులకు
# ప్రాణదానం

**గుండె చికిత్సలు చేసిన విదేశీ వైద్య బృందం**

**వైద్యులను అభినందించిన మంత్రి హరీష్ రావు**

హైదరాబాద్,మార్చి4(ప్రజా మంటలు): నిమ్స్, నిలోఫర్ ఆస్ప త్రిలో పసి పిల్లలకు హార్ట్ సర్జరీలు నిర్వహించి, వారి ప్రాణాలను కాపాడిన బ్రిటన్ వైద్య బృందానికి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిమ్స్ ఆస్పత్రిలో యూకే వైద్యులకు నిర్వహిం చిన సన్మాన కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా

మిగతా... 2లో




## నగరానికి తలమానికంగా
# స్టీల్ బ్రిడ్జ్

**పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కెటిఆర్**

**సత్వరం పూర్తి చేయాలని ఆదేశం**

హైదరాబాద్,మార్చి4(ప్రజామంటలు): సెంట్రల్ హైదరా బాద్ నగరానికి స్టీల్ బ్రిడ్జి తలమానికంగా మారబోతుం దని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. మూడు నెలల్లో వంతెన పనులు పూర్తి చేయా లని అధికారులను కేటీఆర్ ఆదేశించారు. అవసరమైతే అదనపు బృందాలు ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ ఆకస్మికంగా

మిగతా... 2లో

# దేశాభివృద్ధి ప్రక్రియలో మౌలిక సదుపాయాలే కీలకం

**మొదటి పేజీ తరువాయి..**

మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎల్లప్పుడూ మూలస్తంభంగా వుంటుంది. నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ కింద రాబోయే కాలంలో రూ. 110 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి వాటాదారునికి కొత్త బాధ్యతలు, కొత్త అవకాశాలు, సాహసోపేతమైన నిర్ణయాలకు ఇది సరైన సమయం అని ప్రధాని అన్నారు. ఈ వెబినార్‌లో ప్రధాని మోడీ ప్రతిపక్షాలను దుయ్యబట్టారు. 'మునుపటి ప్రభుత్వాలు దేశంలోని మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. అదే ఈ ప్రభుత్వం పేదరికం, ఆధిపత్యం ఆలోచనను తొలగించేందుకు మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తోంది. 2014తో పోలిస్తే నేడు జాతీయ రహదారుల సగటు వార్షిక నిర్మాణం రెట్టింపు అయింది. 2014కి ముందు ప్రతి సంవత్సరం 600 రూట్ కిలోమీటర్ల రైలు మార్గం విద్యుదీకరించబడేది. నేడు అది దాదాపు 4,000 కిలోమీటర్లకు పెరిగింది. విమానాశ్రయాల సంఖ్య 2014కి ముందు 74 ఉంటే.. ఇప్పుడు దాదాపు 150 వరకు ఉన్నాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన గతిశక్తి నేషనల్ మాస్టర్ ఎలాన్‌ను హైలెట్ చేశారు. గతిశక్తి జాతీయ మాస్టర్ ఎ÷-లాన్ ఆర్థిక, మౌలిక సదుపాయాల ప్రణాళిక, అభివృద్ధిని ఏకీకృతం చేయడానికి ఒక గొప్ప సాధనం అన్నారు. దేశంలో సామాజిక మౌలిక సదుపాయాలు ఎంత పటిష్టంగా ఉంటే.. ప్రతిభావంతులైన, నైపుణ్యం ఉన్న యువతకు అంతగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. మౌలిక సదుపాయాలు ఎంత బలంగా ఉంటే.. యువత పని చేయడానికి అంతగా ముందుకు వస్తారు. అందుకే స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ ఫైనాన్స్ స్కిల్స్‌పై దృష్టి పెట్టడం చాలా ముఖ్యం అని మోడీ అన్నారు.

## కాళేశ్వరంలో లక్షకోట్ల అవినీతి

**మొదటి పేజీ తరువాయి..**

భూముల రెట్లు పెరిగాయన్నారు. రేట్లు పెరగడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ భూములను అమ్ముతోందని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారాయని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. సమావేశ అనంతరం శనివారం మీడియాతో మాట్లాడుతూ... ప్రజల సొమ్మును కొద్ది మంది పెద్దలకే బీజేపీ పంచి పెట్టిన విషయాన్ని రాహుల్ జోడో యాత్రలో ప్రజలకు చాటి చెప్పారన్నారు. దేశాన్ని బీజేపీ మత ప్రాతిపదికన విడదీస్తోందని విమర్శించారు. అదానీకి ప్రధాని మోదీ పంచిన సొమ్ముపై హిండెన్‌బర్గ్ రిపోర్ట్ ఇచ్చిందని ఆయన తెలిపారు. ఇకపోతే రాష్ట్రానికి బీఆర్ఎస్ ప్రమాదకరంగా మారిందని అన్నారు. కాళేశ్వరం కట్టి లక్షల కోట్లు తిన్నారని.. ప్రాజెక్టు నుంచి చుక్క నీరు పారలేదని వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టుకు కాల్వలు తవ్వకుండా నీళ్లు ఎట్ల ఇస్తరని ప్రశ్నించారు. కృష్ణా నదిపై పాలమూరు తప్ప కొత్త ప్రాజెక్టేది అని నిలదీశారు. అన్నీ కూడా కాంగ్రెస్ కట్టినవే అని ఆయన అన్నారు. కాంగ్రెస్ సృష్టించిన సంపదతోనే హైదరాబాద్‌లో భూముల రేట్లు పెరిగాయని.. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని కూడా అమ్మేస్తోందన్నారు. 24 గంటల కరెంట్ ఇస్తున్నామని గొప్పలు చెబుతున్నారని.. కానీ కాంగ్రెస్ కట్టిన కరెంట్ ప్రాజెక్టులతోనే సాధ్యమవుతోందని తెలిపారు. బీఆర్ఎస్ కట్టిన కొత్త ప్రాజెక్టు ఒక్కటి కూడా లేదని భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు.

### లిక్కర్ స్కాం కేసులో సిసోడియాకు 6 వరకు

## సిబిఐ కస్టడీ

### బెయిల్ పిటిషన్‌పై విచారణ 10కి వాయిదా

న్యూఢిల్లీ,మార్చి4(ప్రజా మంటలు): లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ మాజీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియాకు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన బెయిల్ పిటి షన్‌పై విచారణను మార్చి 10కి న్యాయస్థానం వాయిదా వేసింది. అలాగే సిబిఐ కస్టడీని కూడా మరో మూడురోజులపాటు పొడిగించింది. మార్చి 6వరకు సిసోడియా సిబిఐ కస్టడీలో ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. ఇక సిసోడియా అరెస్టుకు వ్యతిరేకంగా ఆప్ కార్యకర్తలు ఢిల్లీలో పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. దీంతో సిసోడియాను కోర్టుకు తరలించేందుకు సిబిఐ ప్రధాన కార్యాలయం వద్ద అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కట్టుదిట్టమైన భద్రతల నడుమ



శనివారం మధ్యాహ్నం సిసోడియాను సిబిఐ అధికారులు కోర్టుకు హాజరు పరిచారు. ఈ పిటిషన్‌పైనా కోర్టులో శనివారం వాదనలు జరిగాయి. కస్టడీలో ఉంచితే ఎలాంటి ప్రయోజనం ఉండదని, ఈ కేసుకు సంబంధించి సిబిఐ అన్నింటినీ స్వాధీనం చేసుకుందని, అధికారులు విచారణకు ఎప్పుడు పిలిచినా హాజరవుతానని సిసోడియా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ క్రమంలో మనీష్ సిసోడియా కస్టడీని మరో రెండు రోజుల పాటు రౌస్ ఎవెన్యూ కోర్టు పొడిగించింది. దీంతో ఈనెల 6వ తేదీ వరకూ సిసోడియా సీబీఐ కస్టడీలోనే కొనసాగుతారు. ఈ కేసులో తనకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను కూడా కోర్టు ఈనెల 10వ తేదీకి వాయిదా వేసింది. సిసోడియా బెయిల్ అభ్యర్థనపై సీబీఐకి కోర్టు నోటీసులు పంపింది. ఎక్సైజ్ పాలసీ కుంభకోణంలో సీబీఐ 5 రోజుల కస్టోడియల్ రిమాండ్ శనివారంతో ముగియనుండటంతో ఆయనను భారీ భద్రత మధ్య కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా సీబీఐ హెడ్‌క్వార్టర్స్ ముందు ఢిల్లీ పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్‌ను మోహరించారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఆయనను కోర్టుకు తీసుకురాగా, మరో మూడు రోజుల సీబీఐ కస్టడీని కోర్టు కోరింది. కస్టడీ పొడిగించాల ని సీబీఐ కోరడం సరికాదని సిసోడియా తరఫు సీనియర్ న్యాయవాది దయన్ కృష్ణన్ వాదించారు. సీబీఐ 9 నుంచి 10 గంటల సేపు సిసిడియాను కూర్చోపెట్టి, అడిగిందే పదేపదే అడుగుతూ వచ్చిందని, ఇది మానసికంగా వేధించడమేనని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. దీనికి ముందు, ఎక్సైజ్ పాలసీ కుంభకోణం కేసులో విచారణకు సిసోడియా సహకరించడం లేదని సీబీఐ ఆరోపించింది. సిసోడియా కార్యాలయం నుంచి గత జనవరిలో ఒక కంప్యూటర్‌ను సీజ్ చేశామని, ఆ కంప్యూటర్ నుంచ్ఫ్ఐళ్లు, ఇతర డాటా తొలగించినట్టు కనుగొన్నామని సీబీఐ వర్గాలు తెలిపాయి.

తొలగించిన రిట్రైవ్ చేసేందుకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని, కంప్యూటర్ నుంచి డిలీట్ చేసిన మొత్తం ఫైల్‌ను రిట్రైవ్ చేయడంతో పాటు ఇందుకు సంబంధించిన నివేదికను ఎఫ్ఎస్ఎల్ ఇచ్చిట్టు సీబీఐ వర్గాలు పేర్కొన్నాయి.సీబీఐ ఎప్పుడు విచారణకు పిలిచినా తాను హాజరయ్యేందుకు సిద్ధమని సిసోడియా తెలిపారు. ఈ కేసులో సీబీఐ స్వాధీనం చేసుకున్నవన్నీ ఆ ఏజెన్సీ దగ్గరే ఉన్నందున తనను కస్టడీలో ఉంచడం వల్ల ఎలాటి ప్రయోజనం ఉండదని బెయిల్ పిటిషన్‌లో సిసిడియా పేర్కొన్నారు. ఈ కేసులో ఇంతవరకూ ఏడుగురిపై సీబీఐ ఛార్జిషీటు నమోదు చేసింది.

# విపక్షాల ఐక్యతకు పడని అడుగు

### బిజెపిని నిలువరించే క్రమంలో వెనకడుగు

న్యూఢిల్లీ,మార్చి4(ప్రజామంటలు): ఇటీవలి వరుస ఎన్నికల్లో బిజెపి మరింత బలపడుతుందే తప్ప బలహీనం కావడం లేదు. యూపి మొదలు గుజరాత్,ఈశాన్య రాష్ట్రాల వరకు బలోపేతం అవుతోంది. ఈ ఎన్నికల ఫలితాల తరవాత అయినా విపక్షాల ఐక్యతపై ఓ స్పష్టత వచ్చే అవకాశం కానరావడం లేదు. విపక్షాల్లో అనైక్యతే బిజెపి బలంగా మారింది. యూపి సహా అనేక రాష్ట్రాల్లో బిజెపికి అనుకూల ఫలితాలు వచ్చాయి. తెలంగాణ సిఎం కెసిఆర్ ఢిల్లీలో మకాం వేసినా..పికె సలహాలు ఇచ్చినా విపక్షాలు మేల్కొని కదిలితే తప్ప వీరి ఫ్రంట్ ముందుకు సాగదు. అప్పుడే దేశంలో విపక్ష ఫ్రంట్ ఏర్పడడానికి అవకాశం ఉంటుంది. దానికి తెలంగాణ వేదిక కానుంది. తెలంగాణ సీఎం కేసీఆర్ బీజేపీ వ్యతిరేక పార్టీలను ఏకం చేసే పనిలో వున్నారు. వీరందరి సమావేశానికి ముహూర్తం కూడా అప్పుడే ఖరారు అవుతుంది. జాతీయ రాజకీయాల్లో ఇప్పుడు ఇదే చర్చ సాగుతోంది. జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా కూటమి ఏర్పాటు ప్రయత్నాలు ఇంకా కొలిక్కి రాలేదు. అంతా కాంగ్రెస్ చుట్టే తిరుగుతున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న పార్టీలు ఒక్క తాటిపైకి రావడానికి కసరత్తు కూడా పెద్దగా జరగడం లేదు. బిజెపిని వ్యతిరేకిస్తున్న పార్టీలన్నీ కూడా అవకాశం కోసం చూస్తున్నాయి. ఇప్పటికే బిఆర్ఎస్, టీఎంసీ,డీఎంకే,ఎన్సీపీ, శివసేన ,ఎస్పీ, ఆర్జేడీ పార్టీలు బీజేపీకి వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నాయి. కలసి ముందుకు నడవాలని ప్రకటించాయి. త్వరలో ప్రాంతీయ పార్టీల నేతలతో భేటీ అయ్యేందుకు కెసిఆర్ అడుగు వేశారు. బిఆర్ఎస్‌తో ముందుకు కదలాలని వస్తున్నా ఇతర పార్టీలు కనీసంగా కూడా స్పందించడం లేదు. బిజెపిని నిలువరించాలని అనుకుంటున్న శక్తులను కూడగట్టాలని కెసిర్ చూస్తున్నారు. అన్ని ప్రాంతీయ పార్టీలు జట్టుగా బీజేపీపై రాజకీయ పోరాటం కోసం ఎజెండా సిద్ధం చేసే కసరత్తు చేస్తే తప్ప ఫలితం ఉండదు. బిజెపిని వ్యతిరేకిస్తున్న ప్రాంతీయ పార్టీలు లెక్కలు వేస్తున్నాయి. ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పాటుపై మరింత వేగం పెంచే అవకాశం



కోసం చూస్తున్నాయి. తెలంగాణ సీఎం కేసీఆర్, ఢిల్లీ సీఎం కేజీవ్రాల్, తమిళనాడు సీఎం స్టాలిన్, కేరళ సీఎం పినరయి విజయన్, మహారాష్ట్రమాజీ సీఎం ఉద్ధవ్ థాకరే లాంటివారు బీజేపీయేతర ఫ్రంట్ వైపు అడుగులు వేస్తున్నారు.

# 9 మంది చిన్నారులకు ప్రాణదానం

**మొదటి పేజీ తరువాయి..**

మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. పసి హృదయాలను కాపాడేందుకు, తమ ఆహ్వానం మేరకు నిమ్స్ ఆస్పత్రికి వచ్చిన బ్రిటన్ వైద్య బృందానికి ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ వెంకటరమణ దన్నపనేని తమ బృందంతో వచ్చి నిలోఫర్, నిమ్స్ వైద్యులకు సహకారం అందించారు. అందరూ కలిసి 9 మంచి చిన్నారులకు సర్జరీలు నిర్వహించారు. ఎక్మో మీద ఉన్న చిన్నారికి కూడా సర్జరీ చేయడం గొప్ప విషయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఒక్కో సర్జరీని 20 మందితో కూడిన వైద్య బృందం 4-5గంటల పాటు చేశారు. 9 మంది ప్రాణాలు కాపాడారని హరీశ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా నిమ్స్ ఇంచార్జి డైరెక్టర్ బీరప్పకు, నిలోఫర్ సూపరింటెండెంట్ ఉషారాణికి, సర్జరీలో భాగస్వా ములైన ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు చెప్పారు. పుట్టిన రాష్ట్రంలోని ప్రజలకు సేవ చేయాలని వచ్చిన డాక్టర్ రమణకు ప్రత్యేక అభినందనలు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైద్యులు పుట్టిన గడ్డకు మేలు చేయాలని మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

విదేశీ నిపుణులను తీసుకొచ్చి ఇలాంటి క్లిష్టమైన సర్జరీలు చేసిన సందర్భం ఢిల్లీ ఎయిమ్స్ తర్వాత ప్రభుత్వ నిమ్స్ లోనే జరిగిందని హరీశ్







రావు గుర్తు చేశారు. చిన్న పిల్లలకు గుండె సర్జరీ చేయడం అనేది అత్యంత క్లిష్టమైన, ఖరీదైన వైద్యం అని మంత్రి పేర్కొన్నారు. దీనికోసం ప్రైవేటులో లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. మన నిమ్స్ లో ఈ 9 మంది చిన్నా రులకు పూర్తి ఉచితంగా సర్జరీలు చేయడం జరిగిందని స్పష్టం చేశారు.

తనకు ఈ రోజు ఎంతో సంతోషంగా అనిపించింది. సర్జరీ తర్వాత ఆ పిల్లలు నవ్వు తుంటే మనసు నిండి పోయిందని హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ లో ప్రతి సంవత్సరం 6 లక్షల మంది పిల్లలు పుడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. వీరిలో 5,400 మంది పిల్లలకు గుండె జబ్బులు ఉంటున్నాయి. వారిలో 1000 మందికి శస్త్ర చికిత్స అవసరం అవుతుం దన్నారు. కార్పొ రేట్‌కి వెళ్ళలేక, సరైన సమ యంలో వైద్యం అందక కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకే, తెలంగాణ ప్రభుత్వం మానవీయ కోణంలో అలోచించి వీరికి శస్త్ర చికిత్సల కొరకు ప్రభుత్వ ఆస్పత్రులలో మౌళిక సదుపా యాలు, సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నా మని హరీశ్‌రావు తెలిపారు.

# నగరానికి తలమానికంగా స్టీల్ బ్రిడ్జ్

**మొదటి పేజీ తరువాయి..**

పర్యటించారు. పర్యటనలో భాగంగా స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులతో పాటు ఎస్ఎన్‌డీపీ పనులను కేటీఆర్ పరిశీలించారు. లోయర్ ట్యాంక్ బండ్ నుంచి వీఎస్టీ వరకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనులను కేటీఆర్ పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లా డుతూ... 8 కిలోమీటర్ల పొడవైన నాలుగు వరుసల స్టీల్ బ్రిడ్జి కోసం జీహెచ్ఎంస రూ. 440 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. స్టీల్ బ్రిడ్జి నిర్మాణం తర్వాత ట్రాఫిక్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. ఇదే సందర్భంలో హుస్సేన్ సాగర్ సర్‌ప్లస్ నాలాలో చేపడుతున్న పనులను కూడా కేటీఆర్ పరిశీలించారు. అశోక్ నగర్ వద్ద కొనసాగు తున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను కేటీఆర్ పరిశీలిం చారు. వరద ప్రవాహాన్ని తగ్గించే విధంగా అనేక కార్యక్రమాలు చేపట్టామని కేటీఆర్ తెలిపారు. హుస్సేన్ సాగర్ సర్‌ప్లస్ నాలాకు భారీగా నిధులు కేటాయిం చామని స్పష్టం చేశారు. వర్షాకాలం నాటికి పనులన్నీ పూర్తి చేయాలని కేటీఆర్ అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా ధర్మపురీశుల కళ్యాణం

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రధాన ఘట్టమైన ముగ్గురు ఇలవేలుపుల కళ్యాణోత్సవాల సందర్భంగా ఇసుక స్తంభ ప్రదేశానికి వేంచేసిన స్వాములకు ప్రత్యేక పూజలొ నరించారు.

సాయంత్రం గోధూళి శుభ ముహూర్తంలో సర్వాంగ శోభితంగా తీర్చి దిద్దిన నూతన నిర్మిత కళ్యాణ వేదికయైన దేవస్థానంలోని శేషప్ప కళా వేదికపైకి ఆలయాలనుండి స్వాముల ఉత్సవ మూర్తులను వేదమంత్రో చ్చారణల మధ్య, మంగళవాద్యాలతో భక్తజనం తోడురాగా కొని తెచ్చి ఆసీనుల గావించారు. సాంప్రదాయ రీతిలో యజ్ఞోప వీత ధారణ, రక్షా గోత్రనామ ప్రవరలు, కన్యాదానం, మంగళా ష్టకములు, గూడజీర ధారణ, అక్షతారో పణాది కార్యక్రమాలను విధి విధానంగా నిర్వహిం చారు. సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ కుటుంబం పక్షాన ఆయన సతీమణి స్నేహలతా ఈశ్వర్, కూతురు నందిని, ప్రభుత్వ పక్షాన కలెక్టర్ యాస్మిన్ భాషా, ఎంపీ వెంకటేశ్ నేత, అడిషనల్ కలెక్టర్ మంద మకరంద్, పురపాలక సంఘం పక్షాన మున్సిపల్ చైర్ పర్సన్ సత్తమ్మ, వైస్ చైర్మన్ రామయ్య, కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు సిబ్బంది, తదితరులు వేరువేరుగా స్వాములకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, కట్నకానుకలను సమర్పించారు.

చిల్వా కోడూరుకు చెందిన గందె సుదర్శనరావు, వెంగళాపురం గందె ధర్మారావు, కాంతారావు, గుళ్ళ కోటకు చెందిన గంపుల లక్ష్మీ నర సింహారావు కుటుంబీకులు దైవ కళ్యాణానికి తలంబ్రాలు, మట్టెలు, మంగళ సూత్రాలను వంశపారం పర్య ఆచార నేపథ్యంలో కానుకలుగా సమర్పించారు. దేవస్థానం ఎసి,ఈఓ శ్రీనివాస్, రామయ్య నేతృత్వంలోని అభివృద్ధి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో యజ్ఞాచార్యులు చక్రపాణి వామనా చార్య, వేద పండితులు రమేష్ శర్మ, సంబంధిత అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్యాణోత్సవానికి అశేష భక్తులు హాజరైనారు. ప్రత్యేక టికెట్లు తీసుకుని వేలాది మంది కళ్యాణ కార్యక్రమా లలో ప్రత్యక్ష



భాగస్వాములైనారు. భక్తులు వేదిక ముందు ఆసీనులై తిలకించారు. రాత్రి 10 గంటల వరకూ కళ్యాణ కార్యక్రమం కొనసాగగా, రాష్ట్రంలో వేరెచ్చటను లేని విధంగా క్షేత్ర ప్రాచీన ఆచార నేపథ్యంలో, రాత్రి 10 గంటలకు ప్రధానాలయాలలో మూల విరాట్టులకు కళ్యాణం జరిపించారు. శృంగేరీ పీఠం ఆస్థాన పౌరాణికులు బాచంపెల్లి సంతోష్ శాస్త్రి ప్రత్యక్ష వ్యాఖ్యానం ఆకట్టుకుంది.

పెద్దపెల్లి ఎంపీ వెంకటేశ్ నేత, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఎస్పీ భాస్కర్, మంత్రి ఈశ్వర్ సతీమణి స్నేహలత, తనయ నందిని, మున్సిపల్ చైర్ పర్సన్ సత్తమ్మ, వైస్ రామయ్య, జెడ్పీటీసీ అరుణ, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు కార్యక్రమాలలో భాగస్వాములైనారు. ఈ సందర్భంగా ఎస్పీ భాస్కర్, డీఎస్పీ ప్రకాశ్, సి ఐ కోటేశ్వర్ మార్గదర్శకత్వంలో, ధర్మపురి ఎస్ ఐ ఎస్ కిరణ్ ఆధ్వర్యంలో భారీ ప్రత్యేక పోలీసు బృందాలు ఎలాంటి అవాంఛనీయాలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులను ప్రత్యేక క్యూల ద్వారా వేదిక వద్దకు పంపారు.

# కప్పుకున్న కొత్త పార్టీ కండువా కంటి తుడుపుగానే ఉంటుంది

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా ప్రతినిదుల అభిప్రాయం.

కారణాలు ఏమైనప్పటికిని ముఖ్యంగా మన తెలంగాణ రాష్ట్రం లో అధికార పక్షం లో ఉంటు అసంతృప్తి తో రాజీనామా చేయాలని, పార్టీ ద్వారా సంక్రమించిన పదవిని వీడాలి అని అనుకునే వారి సంఖ్య రోజు రోజు పెరుగుతూ ఒక అగమ్య గోచర పరిస్థితి నెలకుంటున్నాయనేది రాజకీయ మేధావుల విశ్లేషణ.

పక్క పార్టీ చూపులు చూసే ఆశావహులకు జరుగుతున్న విచిత్రమైన సంఘటనలే తెలియని అయోమయంలో పడదొస్తుంది.

స్వతహాగా అంతరూల విధానంతో నడిచే బీజేపీ లాంటి పార్టీ లో ఆత్మ తృప్తి వ్యక్తిగా ఎదగడం ఒక ఓపిక కు పరీక్షే. ఎన్నో ఉదాహరణలు : రాజకీయ ఉద్దండుడు ఒక రకంగా నేటి ఈ విచిత్ర రాజకీయ పరిస్థితులకు మూల కారకుడు రాష్ట్రంలో సెన్సేషన్ ఈటల రాజేందర్ కూడా అననుకూలత వలన అధికార బారాస పార్టీ నుండి తప్పుకుని తప్పనిసరిగా బీజేపీ పార్టీ లో చేరి ఎమ్మెల్యే గా గెలిచి రాష్ట్ర బీజేపీ చేరికలు కమిటీ అనే సాధారణ విషయాన్ని ప్రధాన బాధ్యత గా ప్రచారం చేస్తూ అది కూడా అంత ప్రభావితముగా నిర్వహించలేకపోవడం ఆశావహుల ఆసక్తికర నిరుత్సాహానికి ఒక కారణం గా ఉంది.

ఇక కాంగ్రెస్ పార్టీ చూసినట్లు అయితే పీతల పంచాయితీ అని పార్టీ నాయకులే పార్టీని చంపేయడం ఒక రకంగా ప్రజలలో తీవ్ర దిగ్భ్రాంతికి లోనవ్వడం. తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీలు అయిన బిజెపి, కాంగ్రెస్ ముఖ్య నేతలు కేవలం కెసిఆర్ ను గద్దె దింపడం అనే అజెండా తాలూకా అరుపులు, ఆక్రోశం వ్యక్తపరచడం తప్ప ప్రజలకు కావాల్సిన అభివృద్ధి లేదా ఆశావహ నేతలకు ఎలాంటి భరోసా కల్పించలేకపోవడం రాజకీయ ఆశావహుల కు ఒక రాజకీయ నైరాశ్యం అలుముకుంది అని సదరు జంపింగ్ జపాంగ్‌ల ఆత్మాభిమాన ఘోష.పులి ఎక్కడ ఉన్న పులి గానే ఉండాలి,ఉంటుంది అనే విధంగా ప్రతీ ఆశావహ రాజకీయ నాయకుడు ఉన్న పార్టీ నుండి జంపింగ్ ఆలోచనలో ఉన్నా కూడా ప్రజా బాహుళ్యం లో మేక పోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ రాజకీయ పులిగా జనారణ్యంలో స్వేఛగా దర్పంతో తిరగాల్సినది పోయి పరువు తాలూకా బరువు మోస్తూ జూ లో పులి గా కేవలం ప్రదర్శన గా మాత్రమే కొత్త పార్టీలో ఉండాల్సి రావడం రాజకీయ ఆశావహులలో దిక్కు తోచని గందరగోళం కలిగిస్తుంది.

కప్పుకున్న కొత్త కండువా కంటి తుడుపు గానే ఉంటుంది అని ఎంతో మంది జంపింగ్ జపాంగ్‌లు శోక తప్త హృదయాలతో బరువెక్కి ఉంటున్నారు. సంక్షేమ పథకాలే రాజకీయంగా తిరిగి అధికారం కట్టబెట్టే పట్టుగొమ్మలుగా నడుస్తున్న బారాస పార్టీకి ఎదురుగా బరువు ను పరువుగా మోయరాదు సుమీ !!! అని రాజకీయ వృద్దులు నేటి తరం రాజకీయ ఆశావహులకు హితవు పలుకుతున్నారు.

ఏదీ ఏమైనప్పటికినీ దూర దృష్టి కలిగి నిలకడతో ప్రజా సేవే ప్రథమ లక్ష్యంగా ఉంటూ చేసే ప్రతీ రాజకీయ విధానమే గెలుపు కు సోపానం. అదే ఆశావహ రాజకీయ నేతలకు అధికార పట్టం.



– సిరిసిల్ల రాజా విక్రాంత్ శర్మ.
9963349493.



# బుల్లెట్ కన్నా బ్యాలెట్ పవర్‌ఫుల్

**మొదటి పేజీ తరువాయి..**

హితవు పలికారు. పరభాష వ్యామోహంలో మాతృ భాష, సాంస్కృతిని మర్చిపోవద్దని వెంకయ్య చెప్పారు. -మాతృభాషలో ప్రాథమిక విద్య, పరిపాలన ఉండాలని ఆకాంక్షించారు. కలుం పేరుతో సమాజాన్ని చీల్చే రాజకీయనేతలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు జిల్లా కలెక్టర్లు ఎవరైనా సరే తెలుగులోనే మాట్లాడాలని కోరారు. కులమతాల పేరుతో కొన్ని రాజకీయ శక్తులు మనుషుల మధ్య ద్వేషాలు పెంచే ప్రయత్నాలు చేస్తున్నాయన్న వెంకయ్య.. విద్య వ్యాపారం కాకూడదని తెలిపారు. పేదలకు కూడా అందుబాటులో ఉండే విధంగా విద్యాసంస్థలు సహ కరించాలన్నారు. సమాజంతో సంబంధం లేకుండా కేవలం నాలుగు గోడల మద్యే విద్యను నేర్చుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఆయన చెప్పారు. విద్యార్థుల ఆత్మహత్యలకు కారణం.. సమాజంతో జర్నీ చేయక పోవడమేనని, సెల్‌ఫోన్‌కు బానిసలై సమయాన్ని వృథా చేస్తున్నారని స్పష్టం చేశారు.

# గుండెపోటు

**మొదటి పేజీ తరువాయి..**

కాలేజీలో చదువుతున్న ఓ విద్యార్థి గుండెపోటుతో మృతిచెందాడు. స్నేహితులతో సరదాగా ముచ్చట్లు పెడుతున్న విశాల్ సడన్‌గా కిందపడిపోయాడు. దీంతో తోటివారు ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మరణించాడు. గతవారం బోయిన్‌పల్లిలో ఓ కానిస్టేబుల్ జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా సడన్‌గా కూలబడిపోయాడు. తోటివారు వచ్చేలోపు ఆయన గుండె ఆగిపోయింది. తాజాగా పెద్దపల్లి జిల్లా డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ తమ్ముడు శైలేందర్ సింగ్ ఉన్నట్టుండి గుండెపోటుతో మృతిచెందారు. గోదావరిఖనికి చెందిన శైలేందర్‌సింగ్ రోజూలానే శుక్రవారం తన ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా కార్డియాక్ అరెస్టుతో కుప్పకూలిపోయారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్న శైలేందర్.. తలుపునకు తాళం వేసి.. నాలుగు అడుగులు వేశారు. ఈ క్రమంలో గుండె నొప్పిరావడంతో పక్కనేఉన్న గోడను పట్టుకుని కిందపడిపోయారు. క్షణాల వ్యవధిలోనే ప్రాణాలు వదిలారు. ఇదంతా శైలేందర్ ఇంటిబయట ఉన్న సీసీ కెమెరాలో రికార్డయింది. ఇక మరో ఘటనలో శనివారం ఉదయం బాపట్ల జిల్లా చీరాల మండలం వాకావారిపాలెంలో జరిగిన ఘటన షాక్‌కు గురి చేసింది. ఉదయం యథావిధిగా ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన టీచర్ వీరబాబు.. క్లాసు రూంలో పిల్లలకు పాఠాలు చెబుతూ.. కుర్చీలో అలాగే ప్రాణాలు వదిలాడు. పాఠాలు చెబుతున్న మాస్టారు.. ఒక్కసారిగా కుర్చీలోనే కూలడటంతో పిల్లలకు అర్థం కాక కేకలు వేశారు. పక్క గదుల్లో క్లాసులు చెబుతున్న మిగతా ఉపాధ్యాయులు ఏం జరిగిందో తెలుసుకోవటానికి పరిగెత్తుకుంటూ వచ్చారు. అప్పటికే టీచర్ వీరబాబు కుర్చీలో కూలబడి ఉండటాన్ని గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. గ్రామంలో డాక్టర్‌ను పిలిపించారు. అతను వచ్చి పరీక్ష చేయగా.. అప్పటికే చనిపోయినట్లు స్పష్టం చేశారు. దీంతో తోటి ఉపాధ్యాయులు టీచర్ వీరబాబును అంబులెన్స్ లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 3వ తేదీ మధ్యాహ్నం నుంచి మార్చి 4వ తేదీ మధ్యాహ్నం వరకు.. అంటే 24 గంటల్లోనే తెలుగు రాష్ట్రాల్లో ముగ్గురు వ్యక్తులు గుండెపోటుతో చనిపోవటం కలకలం రేపుతోంది. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ కాలేజీలో 18 ఏళ్ల ఇంజనీరింగ్ స్టూడెంట్ నడుస్తూ నడుస్తూ చనిపోయాడు.. పెద్దపల్లి జిల్లాలో ఓ వ్యక్తి తన అపార్ట్ మెంట్ లిఫ్ట్ దగ్గర కుప్పకూలి చనిపోయాడు.. ఇప్పుడు చీరాల మండలంలోని వాకావారిపాలెంలో ప్రభుత్వ టీచర్ పాఠాలు చెబుతూ చనిపోయాడు.. ఈ ఘటనలతో జనంలో ఆందోళనలు నెలకొన్నాయి. గట్టి గుండెలు సడెన్‌గా ఆగిపోవటంపై ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు.

### త్రిపురలో 8న కొలువుదీరనున్న

# కొత్త ప్రభుత్వం

### ప్రమాణస్వీకారానికి హాజరు కానున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,మార్చి4(ప్రజా మంటలు): త్రిపురలో 8న కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్నది. త్రిపురలో బీజేపీ మరోసారి అధికారం చేపట్టను న్నది. ఈ సందర్భంగా ప్రధాని మోడీ ఈ నెల 8న త్రిపురలో పర్యటించ బోతున్నారు. త్రిపురలో కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు త్రిపుర సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. త్రిపురలో ప్రధాని పర్యటనకు సంబంధించి ముఖ్య కార్యదర్శి ఎస్‌కే సిన్హా సీనియర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్పీజీ బృందం కూడా త్రిపురకు చేరుకోనుంది. ఇకపోతే త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖనుశుక్ర వారం గవర్నర్ సత్యదేవ్ నారాయణ్ ఆర్యకు సమర్పించారు. త్రిపురలో మార్చి 8న కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుందని..ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరవుతారని వెల్లడించారు. కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవం వివేకానంద మైదానంలో జరగనుంది. త్రిపురలో బీజేపీ మరోసారి అధికారం చేపట్టనున్న నేపథ్యంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వాశర్మ త్రిపురకు వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాల్లో గత నెల ఎన్నికలు జరిగాయి. మార్చి 2న ఫలితాలు వెలవడ్డాయి. అయితే త్రిపురలో మరోసారి బీజేపీ అధికారంలోకి వచ్చింది. మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకుగానూ... బీజేపీకి 32 స్థానాల్లో విజయం సాధించింది.



జగిత్యాల పట్టణంలోని ఉప్పరిపేట్ కు చెందిన రాజేశ్వర్ రావు ప్రయాణిస్తున్న కారు టైర్ పేలడంతో రాజేశ్వర్, అతని కుటుంబ సభ్యులు ముగ్గురు గాయలపాలై అయిల్నేని హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఆయనతో ఉన్నఅల్లాల ఆనంద్ రావు యూత్ సభ్యులు, తదితరులు

# కులమతాలకు ప్రతీక

**జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి/ ధర్మపురి మార్చి 04 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా శనివారం కులమతాలకు అతీతంగా నిలిచి వారి భక్తిని చాటుకున్నారు. ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి పట్టు వస్త్రాలు,



ముత్యాల తలంబ్రాలు సమర్పించి జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ప్రతీకగా నిలిచారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి స్వయంగా ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా. భక్తులు, నెటిజన్లు కలెక్టర్ ను అభినందించారు. సోషల్ మీడియాలలో ఆమె ఫోటోలను వైరల్ చేస్తు అభినందించారు.

# నిరుపేద విద్యార్థినిని దత్తత

**ధర్మపురి మార్చి 04 (ప్రజామంటలు):** ధర్మపురి కి చెందిన విద్యార్థి మసీదు మేఘన కు అనస్థీషియా టెక్నాలజీ కోర్సులో నిజామాబాద్ లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్ రావడం జరిగింది. అయితే ఆ అమ్మాయి చదువుకు సంవత్సరానికి 30 వేల



రూపాయలు అవుతుండగా, ఆ ఖర్చులు భరించే స్థితిలో తన కుటుంబం లేకపోవడంతో ఆ విద్యార్థినిని స్టూడెంట్ అడాప్షన్ ప్రోగ్రాం ద్వారా దాతల సహకారంతో దత్తత తీసుకొని చదివించడం జరుగుతున్నది. దానిలో భాగంగా విద్యార్థి నాలుగు సంవత్సరాల చదువుకు అయ్యే ఖర్చులు లక్షా ఇరవై వేల రూపాయలు చెల్లించడానికి అమెరికాలో ఉంటున్న ధర్మపురికి చెందిన ఎన్ఆర్ఐ కశోజ్జల చంద్రశేఖర్ ముందుకు వచ్చారు. అందుకు గాను మొదటి సంవత్సరం ఖర్చులు రూ. 30 వేలు ఈ రోజు అమ్మాయికి అందజేయడం జరిగింది. వారికి సంస్థ తరుపున ధన్యవాదాలు. కార్యక్రమంలో శాప్ కన్వీనర్ గొల్లపెల్లి గణేశ్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు డా. రామకృష్ణ, శాప్ సభ్యులు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

**డా. గణేశ్ గొల్లపెల్లి**
**కన్వీనర్, స్టూడెంట్ అడాప్షన్ ప్రోగ్రాం,**
**ధర్మపురి**

**హనుమకొండ లో రాష్ట్ర స్థాయి**

# అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలు

**హన్మకొండ మార్చి 04 (ప్రజామంటలు):** కాకతీయుల రాజధాని హనుమకొండ లో కాకతీయ యూనివర్సిటీ లో ఈ వేడుకలను నిర్వహించ బోతున్నట్లు తెలిపారు. తెలంగాణా గౌరవం ఇనుమడించెలా రాష్ట్ర స్థాయి అంతర్జాతీయ మహిళ దినోత్సవం



వేడుకలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు..రాష్ట్ర శిశు, సంక్షేమ, గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనేక రంగాల్లో ప్రతిభ చూపిస్తున్న నైపుణ్యం కలిగిన మహిళలకు కమిటీ సూచించిన ప్రకారం పారదర్శకంగా అవార్డులు ఇచ్చి మహిళలను గౌరవించ నున్న ట్లు తెలిపారు. ఈ అవార్డు ల కోసం ఎంపికైన వారికి లక్ష రూపాయల నగదు,శాలువా, మెమెంటో లతో సత్కరిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమం కూడా ఉంటుందని, అందులో భాగంగా మహిళ దినోత్సవం నాడు మహిళ క్లినిక్ ప్రారంభం చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ గోపి, రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ భారతి హొళి, వీ. సీ. తాటికొండ రమేష్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజెన్స్ మ్యారేజ్ బ్యూరో..!

- తోడూ..నీడ కోసమే..భార్య/భర్త కోల్పోయిన సీనియర్ సిటిజెన్స్ కే పెళ్లిళ్ళు
- తెలుగు రాష్ట్రాల వ్యాప్త సేవలు

**జగిత్యాల మార్చి 04 ( ప్రజామంటలు):** వృద్ధాప్యంలో జీవిత సహచరులను దురదృష్టవశాత్తు కోల్పోయిన వారికి తోడూ..నీడ అత్యవసరమే. ఐయితే సమాజం ఏమంటుందో ,కుటుంబీకులు ఎలా అర్థం చేసుకుంటారో అని తాము సీనియర్ సిటిజన్లుగా జీవన ప్రయాణం లో కొడుకులు కోడళ్లను0చి నిరాదరణకు గురై తమలో తాము మనో వేదన ను అనుభవిస్తూ చాలా మంది ముందుకు రావడం లేదు.ఈ పరిస్థితిని తెలంగాణ అల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గా,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ తన దగ్గరకు వచ్చి వారిపై ట్రిబ్యునల్ లో కేసులు వేయాలని వచ్చిన వారి ఇండ్లకు స్వయంగా, తన బృందం తో వెళ్లి పరిశీలించారు. ఆ కుమారులకు కొడళ్లకు కౌన్సిలింగ్ చేసినా ఎలాంటి ఫలితం లేక పోవడం తో రెవెన్యూ డివిజన్ ల అధికారుల వద్ద ట్రిబ్యునల్లో ఫిర్యాదులు తానే స్వయంగా దాఖలు చేశారు .పలు ఫిర్యాదు కేసుల్లో సంబంధించిన ఆర్డీవోలు ఆ నిరాదరణకు గురి చేస్తున్న వారిలో కొందరికి 3 మాసాల జైలు శిక్షలు, నెలకు ఇంత పోషణ ఖర్చులు ఇవ్వాలని ,కొడుకులు తండ్రి ఆస్తులు తమ పేరు మీద చేసుకుంటే తిరిగి ఆ తండ్రి పేరు మీద పట్టా చేయడం,లేదా రివర్స్ మార్టిగేజ్ ద్వారా ఆ భూములపై అప్పు జీవితాంతం ఎలాంటి వడ్డీ లేకుండా ఇప్పించడం వంటి ట్రిబ్యునల్ తీర్పులు సంబంధించిన ఆర్డీవోలతో ఇప్పించడం తో ఆవృద్ధులకుఊరట కల్గింది.అయినప్పటికీ జీవిత సహచరులను కోల్పోయిన ఆ సీనియర్ సిటిజెన్స్ కు తోడూ నీడ అత్యవసరాన్ని గుర్తించి పరిష్కార మార్గంగా తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజెన్స్ మ్యారేజ్ బ్యూరో ను జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. తమ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ. నర్సింహారావు



సలహాలతో, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, గత ఎంపీ,ప్రస్తుత నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్,కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జిల్లా పరిషత్ చైర్మన్ దావా వసంత ల సహకారంతో 2019 జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున సీనియర్ సిటిజెన్స్ కు తోడూ నీడ కోసం సీనియర్ సిటిజెన్స్ మ్యారేజ్ బ్యూరో ఏర్పాటు చేశారు. హరి అశోక్ కుమార్ తమ సంఘం ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాతం, జగిత్యాలమాజీ మున్సిపల్ చైర్మన్ జీ.ఆర్. దేశాయ్, వెలముల ప్రకాష్ రావు, సింగం భాస్కర్, మానాల కిషన్, విద్యాసాగర్, పబ్బా శివానందం, గంటేడి రాజ్ మోహన్, పీ.సి. హన్మంత్ రెడ్డి,నారాయణ, ఉప్పుగళ్ల మురలీదర్, కరుణ, విజయ, కస్తూరి శ్రీమంజరి, లత, తదితరుల బృందం సహకారంతో ఈ సీనియర్ సిటిజెన్స్ మ్యారేజ్ బ్యూరో ద్వారా ఇంత వరకు తెలంగాణ రాష్ట్రాల్లోని 119 మంది సీనియర్ సిటిజెన్స్ కు పెళ్ళి సంబంధాలు కుదిర్చారు. వాట్సాప్, ఫేస్ బుక్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడం సత్ఫలితాలు ఇచ్చినట్లు, తమ సంఘాల రాష్ట్ర వ్యాప్త సభ్యుల లింక్ గ్రూప్ ల్లో తన ఆలోచన హరి అశోక్ కుమార్ పంచుకోగా మంచి రెస్పాన్స్ వచ్చింది.

**తోడూ.. నీడ... వృద్ధాప్యంలో అత్యవసరం**
**హరి అశోక్ కుమార్, న్యాయ వాది**

వృద్ధాప్యంలో జీవిత సహచరులను కోల్పోయిన వారికి తోడు. నీడ అవసరం ఏంతయినా ఉంటుంది.ఇందు కోసం వివాహం చేసుకోవడమే పరిష్కారం. ఒకప్పుడు వితంతు వివాహాలను సమాజం నిషేధించింది, మారిన కాల పరిస్థితుల్లో మహనీయుల ఉద్యమాల నేపథ్యంలో వాటిని సమాజం అంగీకరిస్తోంది.ఇలాంటి విసయాలను దృష్టిలో ఉంచుకొని ప్రమాదాల్లో, అనారోగ్య కారణాలతో సహచరులను కోల్పోయిన,చట్టబద్ధంగా విడిపోయిన సీనియర్ సిటిజెన్స్ కోసం మా సంఘం ఆధ్వర్యంలో సీనియర్ సిటిజెన్స్ మ్యారేజ్ బ్యూరో ఏర్పాటు చేయగా సత్ఫలితాలు ఇస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో పలువురు కుటుంబీకులు సీనియర్ సిటిజెన్స్ ను మళ్ళీ వివాహాలు చేసుకోకుండా పలు అభ్య0తరాలు వ్యక్తం చేస్తూ అడ్డంకులు చెబుతున్నారు.అయినప్పటికీ జీవితాంతం తోడు నీడ కోసం వారిని ఎదిరించి కొందరు ముందుకు వస్తున్నారు. అందుకు మా సంఘ ప్రతినిధులు సహకరిస్తున్నారు.

# నిట్ (వ)లో సీమెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ప్రారంభం

**హన్మకొండ మార్చి 04 (ప్రజామంటలు):** ప్రతిష్టాత్మక నిట్ (వరంగల్) లో సిమెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లోని అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ ల్యాబ్‌లో 3డి ప్రింటింగ్ పరికరాలను డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్వి.రమణారావు ప్రారంభించారు. ప్రొఫెసర్ ఎన్వీ రమణారావు మాట్లాడుతూ వరంగల్ ఎన్ఐటీ లోని సీమెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అభివృద్ధి చెందడం సంతోషంగా ఉందన్నారు. అతి త్వరలో ఈ సదుపాయం మొత్తం 18 ల్యాబ్‌లను సిద్ధం చేసి వివిధ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు అందుబాటులోకి వస్తుందని ఆయన చెప్పారు. సీమెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రొఫెసర్ %ం% సీఈఓ ప్రొఫెసర్ ఎల్.కృష్ణానంద్, వివిధ ల్యాబ్‌ల ఇన్‌ఛార్జ్ ప్రొఫెసర్లు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డీన్‌లు, అడ్వైజర్లు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, ప్రొఫెసర్లు మరియు రీసెర్చ్ విద్యార్థులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ పరికరాలు విలువ 65 లక్షలు. పరికరాలు క్రియాత్మకమైన ఉత్పత్తులను సృష్టించగలవు మరియు తయారీ ప్రక్రియలో ఉన్న అసెంబ్లీని నివారించగలవు. మొదట ప్రొడక్ట్ 3డి స్ప్రింట్ సాఫ్ట్‌వేర్‌ని ఉపయోగించి రూపొందించబడుతుంది మరియు ప్రొడక్ట్ స్ప్రింట్ యొక్క ప్రింటింగ్ తయారు చేయబడుతుందని తెలిపారు. పరిశోధక విద్యార్థులకే కాకుండా ప్రోటోటైప్‌లను నిర్మించాలనుకునే పారిశ్రామికవేత్తలకు కూడా ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయి. సీమెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు



సిమెన్స్ ద్వారా ఎమ్ఓయులో భాగంగా నిధులు సమకూరుతాయి. ఎంఓయూ ప్రకారం, మూడేళ్లలో 30,000 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 18 ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తారని తెలిపారు.

# ఆరోగ్యశ్రీలో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు

**గాంధీ ఈ.ఎన్.టీ హెచ్.ఓ.డీ. డా. శోభన్ బాబు**

**కోఠి ఈ.ఎన్.టీ. హాస్పిటల్ లో వరల్డ్ హియరింగ్ డే వేడుకలు**

**సికింద్రాబాద్ మార్చి 04 (ప్రజామంటలు):** వినికిడి సమస్యలు కలిగిన చిన్నారులకు చేసే ఖరీదైన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు



ఇప్పుడు ఆరోగ్యశ్రీ లో ప్రభుత్వం చేర్చడం జరిగిందని, ప్రైవేట్ లో రూ. 15 లక్షల వరకు ఖర్చు అయ్యే కాక్లియర్ ఇంప్లాంటేషన్ ఆరోగ్యశ్రీ కింద గాంధీ ఆసుపత్రిలో ఉచితంగా చేస్తున్నామని గాంధీ ఆసుపత్రి ఈ.ఎన్.టీ డిపార్ట్ మెంట్ హెడ్ ప్రొ. శోభన్ బాబు పేర్కొన్నారు.వరల్డ్ హియరింగ్ డే సందర్భంగా కోఠి ఈ.ఎన్.టీ ఆసుపత్రి, గాంధీ ఈ.ఎన్.టీ డిపార్ట్ మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. గత 15 ఏండ్లుగా కాక్లియర్ ఇంప్లాంటేషన్ జరిగిన చిన్నారులకు



ఫ్యాన్సీ డ్రెస్ కాంపీటీషన్ నిర్వహించి, బహుమతులను అందచేశారు. పలువురు చిన్నారులకు ఒటోలారింగోలోజిస్ట్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ శాఖ నిర్వాహకులు హియరింగ్ ఏయిడ్ మిషన్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శోభన్ బాబు తో పాటు గాంధీ ఈ.ఎన్.టీ. అసిస్టెంట్ ప్రొఫెసర్ రత్న, కోఠి ఈ.ఎన్.టీ. హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. శంకర్, డా. ఎల్.ఎస్.రెడ్డి, డా. ఆనంద్, సాయికిరణ్, వీణ, అనూష, లతో పాటు తెలంగాణ ఆడియోలాజీ అండ్ స్పీచ్, లాంగ్వేజ్ పాథోలాజి అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణ బచావో సదస్సు
# కరపత్రం ఆవిష్కరించిన ప్రొ. కోదండరాం

**హుజూరాబాద్ మార్చి 04 (ప్రజామంటలు):** ఈనెల 10వ తేదీ హైదరాబాదులోని బాగ్ లింగంపల్లిలో జరిగే తెలంగాణ బచావో సదస్సు కరపత్రంను శనివారం హుజూరాబాద్ పట్టణంలో తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన ఎంతోమంది అమరుల త్యాగాలు వృధా అయ్యాయని, తెలంగాణ సాధన తర్వాత తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వ%శీ% పాలనలో పూర్తిగా విఫలమయ్యిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముక్కెర రాజు, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికిల్ల స్రవంతి, పెద్దపల్లి జిల్లా కన్వీనర్



జనగామ నర్సింగ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కర్ర సతీష్ యాదవ్, మానకొండూరు నియోజకవర్గ ఇంఛార్జీ కనకం కుమారస్వామి, నాయకులు మోరె గణేష్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ ధరను
# తగ్గించాలని నిరసన, ధర్నా

**జనగామ మార్చి 04 (ప్రజామంటలు):** అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్




ధరను తగ్గించాలని నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చీర రజిత పాల్గొని మాట్లాడారు. మోడీ ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా గ్యాస్ ధరలు పెంచి కానుకగా ఇచ్చిందన్న రూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు 450 ఉన్న గ్యాస్ ధర 1150 కి ఈరోజు పెంచిందన్నారు, డొమెస్టిక్ సిలిండర్ ధర 50 పెంచుతూ కమర్షియల్ సిలిండర్ ధర 350 పెంచి ప్రజలపై మహిళలపై అధికంగా భారాలు మోపిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ సీనియర్ నాయకురాలు బూడిద అంజమ్మ, సుంచు ప్రభావతి, భానుప్రియ, ఫంగ సుజాత నర్సమ్మ జిల్లా సువర్ణ గంగమ్మ, టి. లక్ష్మి, ఎర్ర శాంతమ్మ, బూడిద భవాని, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# గట్టు మల్లన్న హుండీల లెక్కింపు

**వేలేరు మార్చి 04 (ప్రజామంటలు):** వేలేరు మండలం లోని మల్లీకుదుర్ల గ్రామ శివారులో ఉన్న గట్టు మల్లికార్జునస్వామి హుండీలను ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు, దేవాదాయ



ధర్మాదాయ వరంగల్ డివిజన్ పరిశీలకులు జి. సంజీవరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ పేరబోయిన రవి యాదవ్ ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ... గత 3 నెలలకు సంబంధించిన 8 హుండీలను తెరిచి లెక్కించగా, రూ.2,23,986 లు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురేష్, డైరెక్టర్ లు కుమారస్వామి, శ్రీలత రవీందర్, చేరాలు, ఆలయ అర్చకులు వినయ్ శర్మ, మహేష్ శర్మ, ఒగ్గు పూజారులు తదితరులు పాల్గొన్నారు.



మోతుకురావుపేట గ్రామనికీ చెందిన బండారి లింగం కూతురు మౌనిక ఇటీవల హత్యకి గురైన సందర్భంగా, వారి కుటుంబ సభ్యులను మాజీ జెడ్పీ ఛైర్పర్సన్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ పరామర్శించారు. వెంట సర్పంచ్ దుంపేట లక్ష్మి నర్సయ్య, మారుతి, సురేష్ రావు, శ్రీను, సత్యపాల్, సంతోష్, శేఖర్ ఉన్నారు.

# గెలుపు లక్ష్యంగా బిజెపి ఎత్తులు!

మొన్నటి గుజరాత్ ఎన్నికల్లో ఘన విజయం తరవాత బిజెపి ఏ మాత్రం తగ్గడం లేదు. హిమాచల్‌లో ఓడినా దానిని పెద్దగా ప్రచారం కాకుండా చేసింది. గుజరాత్ బలిమిని ఆకాశమంత చేసి ప్రచారం చేసుకున్నారు.త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ శాసనసభలకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు బిజెపికి అనుకూలంగా రావడంతో ఇక బిజెపి మరింత దూకుడు ప్రదర్శించే అవకాశం ఉంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగిన ఈ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటి తనకు తిరుగులేదన్న సంకేతాలు ఇచ్చింది. ఈ ఫలితాలు సార్వత్రిక ఎన్నికలపై పెద్దా ప్రభావం చూపవని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే లాంటి వారు కొట్టి పారేసినా.. ప్రజల్లో నాటుకున్న భావనలను మాత్రం తోసిపుచ్చలేం. త్రిపుర, నాగాలాండ్‌లో బీజేపీ కూటమి విజయ కేతనం ఎగురవేయగా, మేఘాలయలోనూ బీజేపీ చక్రం తిప్పబోతోంది. సీఎం కన్రాడ్ సంగ్మా పార్టీ ఎన్‌పీపీ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ మార్కును సాధించలేక పోయింది. ఫలితంగా ఇప్పుడు సంగ్మా బీజేపీవైపు చూస్తున్నారు. అన్నీ అనుకున్నట్టు జరిగితే బీజేపీతో ఆయన చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు. ఎగ్జిట్‌పోల్స్ ఊహించనట్టుగానే ఈ ఫలితాలు బీజేపీకి అనుకూలంగా వచ్చాయి. ఈ విజయం బీజేపీకి జాతీయ స్థాయిలో మరింత బలాన్ని ఇచ్చింది. అలాగే రేపు జరగగబోయే వివిధ రాష్ట్రాల ఎన్నికలకు కూడా బూస్ట్ కానుంది. తెలంగాణ లాంటి రాష్ట్రాల్లో మున్ముందు మేలు చేస్తుందనే భావన ఉంది. అలాగే కర్నాటక, ఛత్తీస్‌ఘడ్‌లలో విజయం సాధిస్తామన్న భావనలో ఉంది. నిజానికి ఈశాన్య రాష్ట్రాల్లో గెలుపు ద్వారా తమకు ఎక్కడైనా ప్రజల ఆదరణ ఉందని చెప్పుకుంటూ వస్తోంది. ఈశాన్య రాష్ట్రాల ఫలితాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేయలేకపోయినా.. దేశంలో అంతటా బిజెపికి బలం ఉందని చెప్పుకోవడానికి పనికి వస్తుంది. చిన్న రాష్ట్రాలనైనా గుప్పిట పెట్టుకోవాల్సిందే అన్నది బిజెపి రాజకీయం. దేశ రాజకీయాలు ప్రధానంగా ఉత్తర భారతదేశం చుట్టూనే తిరుగుతూ ఉంటాయి. కాబట్టే ఇటు ఈశాన్య రాష్ట్రాలను జాతీయ పార్టీలు పెద్దగా పట్టించుకోలేదు. అక్కడ లోక్‌సభ స్థానాలు కూడా చాలా తక్కువ కావడం అందుకు మరో కారణం. కానీ బిజెపి వచ్చాక ఈ చిన్న రాష్ట్రాల్లో కూడా పాగా వేయాలన్న లక్ష్యంతో పనిచేసింది. ఈ క్రమంలోనే తెలంగాణలో కూడా పాగా వేయాలన్న పట్టుదలతో ఉంది. అందుకే తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎపిలోనూ పాగా వేయకున్నా బలపడాలన్న పట్టుదలతో ఉంది. ఇక లిక్కర్ స్కామ్‌లో దూకుడు వెనక ఎమ్మెల్సీ కవితను కూడా ఇరుకున పెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. అటు ఎపిలోనూ ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయుడిని చేర్చడం ద్వారా అక్కడా రాజకీయ లబ్ది పొందే ప్రయత్నాల్లో




బిజెపి ఉంది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో సౌత్ గ్రూప్‌నకు డిప్యూటి సీఎం మనీష్ సిసోడియా సహకరించారని, సౌత్ గ్రూపులో కవిత కూడా ఉందని ఈడీ, సీబీఐలు చార్జ్ షీట్స్ కూడా దాఖలు చేశాయి. సిసోడియా ఆఫీసులోనే కొత్త మద్యం పాలసీ డ్రాఫ్ట్ తయారైందని సీబీఐకి పక్కా ఎవిడెన్స్ దొరికినట్లు ప్రచారం జరుగుతోంది. ఒకట్రెండు రోజుల్లో కవిత అరెస్ట్ తప్పదని బీజేపీ వర్గాలు బలంగా వాదిస్తున్నాయి. ఇక, కాంగ్రెస్ ప్లీనరి సమావేశాల్లో అగ్ర నేతల నుండి కాంగ్రెస్- బీఆర్ఎస్ పొత్తు తప్పకపోవచ్చన్న సంకేతాలు కూడా వచ్చినట్లు బీజేపీ విశ్వసిస్తోంది. ఎన్నికల తర్వాత పొత్తు తప్పకపోవచ్చని సీనియర్ నేత, ఎంపీ కోమటిరెడ్డి వంటి నేతలు బయట చేసిన కామెంట్స్ దావానంలా వ్యాప్తి చెందాయి. జాతీయ రాజకీయాల దృష్ట్యా ముందే పొత్తులుంటాయని ఏఐసీసీ అగ్రనేతలు లోపాయకారి వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో బీజేపీ అధిష్టానం కూడా కాంగ్రెస్,బిఆర్ఎస్ లమధ్య పొత్తులు ఉంటాయిన చెప్పడం ద్వారా ఈ రెండు పార్టీలను ఒకే గాటన కట్టే ప్రయత్నాలు చేస్తోంది. కవిత అరెస్ట్ అయితే రాష్ట్రంలో బీజేపీ పుంజుకుంటుందా... బీఆర్ఎస్ అడ్వాంటేజ్ తీసుకుంటుందా, కాంగ్రెస్-బీఆర్ఎస్ కలిస్తే బీజేపీకి ఛాన్స్ ఉంటుందా... అన్నది వేరు విషయం. అయితే ప్రస్తుత సమీకరణాలను మాత్రం బిజెపి బాగా అధ్యయనం చేయడం ద్వారా రానున్న ఎన్నికల నాటికి బలోపేతం కావాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది. వీటన్నింటిపై చర్చించేందుకే అమిత్ షా బీజేపీ రాష్ట్ర స్థాయిలో ఉన్న అగ్ర నాయకత్వాన్ని ఢిల్లీ పిలిపించినట్లు తెలుస్తోంది. కవిత అరెస్ట్ జరిగితే తీసుకోవాల్సిన స్టెప్స్, కాంగ్రెస్-బీఆర్ఎస్ పొత్తును ఎలా ఎస్టాబ్లిష్ చేయాలి, వారు ఒక్కటైతే బీజేపీ ఫోకస్ ఎలా ఉండాలి... ఇలా ప్రతి అంశంపై చర్చించిన బీజేపీ పెద్దలు మార్గనిర్దేశనం చేయబోతున్నట్లు సమాచారం. అమిత్ షా రాష్ట్ర రాజకీయాల్లో తరచూ జోక్యం చేఉకుని ఎలా ముందుకు వెళ్లాలో సూచిస్తున్నారు. విచిత్రమేమంటే ఏడు దశాబ్దాల పాలనలో కాంగ్రెస్ అనుసరించిన సంస్కృతిని ప్రధానమంత్రి నరేంద్రమోద, అమిత్ షాలు అమలు చేస్తున్నారు. దర్యాప్తు సంస్థలను గుప్పిట్లో పెట్టుకోవడం, పార్టీల్లో సీనియర్లను పక్కన పెట్టడం, ముఖ్యమంత్రులను మార్చడం తదితర నిర్ణయాలన్నీ గతంలో కాంగ్రెస్ చేసి చూపింది. బిజెపి రాజకీయాల తీరు కాంగ్రెస్ సంస్కృతికి ఏ మాత్రం భిన్నంగా లేవనడానికి అనేక నిర్ణయాలు ఉదాహరణగా నిలుస్తాయి. ఈ మొత్తం వ్యవహారంలో అధికారమే లక్ష్యంగా మోడీ ద్వయం అడుగులు వేస్తోంది. మన్మోహన్ సింగ్‌ను కీలుబొమ్మ ప్రధానమంత్రిగా అభివర్ణించిన వారే మోడీ హయాంలో ఇప్పుడంతా కీలుబొమ్మలుగా మారారు. మోదీ హయాంలో బిజెపి కూడా కాంగ్రెస్ మాదిరే అధిష్ఠానవర్గాన్ని అత్యంత బలోపేతంగా మార్చి ప్రజలు, వారు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల అభిప్రాయానికి విలువలేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నది. మోదీ హవా కూడా ఆయన ఆకర్షణ ఓట్లు తేగలిగినంత కాలమే సాగుతుంది. స్థానికంగా బలహీనులైన, కీలుబొమ్మలైన నేతలను ప్రోత్సహిస్తే కేంద్రం బలహీనపడ్డప్పుడు తదనుగుణంగా రాష్ట్రాల స్థాయిలో కూడా బిజెపి కుప్పకూలిపోతుంది. అయితే ఇకముందు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్న దానిపైనే భవిష్యత్ రాజకీయం ఆధారపడి ఉంటుంది.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## గుణపాఠం

పావనపురం ఓ చిన్న ఊరు. దానిని ఆనుకుని హంద్రి అనే నది పారుతోంది. దానికి వానాకాలంలోవరదలు వస్తుంటాయి. అప్పుడు నది దాటి పక్క ఊరికి పోవాలంటే గురవయ్య పడవ ఒక్కటే గతి.ఎందుకంటే వేరెవ్వరికీ ఆ ఊరులో పడవలు లేవు.

ఒక సంవత్సరం పెద్ద వానలు పడ్డాయి. ఆ వానల వలన హంద్రికి వరదలు వచ్చాయి. గురవయ్య లో ఆశ పెరిగిపోయింది! ఇంతకు మునుపు గురవయ్య నది దాటించడానికి ఎనిమిది రూపాయలు



తీసుకునేవాడు, ఇప్పుడు వరదలొచ్చాయి కనుక నది దాటించాలంటే పదహారు రూపాయలుగా ధర నిర్ణయించాడు. గురవయ్య అత్యాశను ప్రజలు గమనించినా ఏమీ అనలేక పోయ్యారు.కారణం గురవయ్య పడవ తప్ప మరో పడవ లేదు.

ఒక రోజు ఆఊరి వైద్యుడు శంకరం అత్యవసర పనిమీద పక్క ఊరికి వెళ్ళ వలసి వచ్చింది. శంకరం పడవ దగ్గరకు వచ్చి గురవయ్య పదహారు రూపాయలనే సరికి ఆశ్చర్య పోయాడు.

"ఏమిటి గురవయ్యా ఎనిమిది నుండి పదహారు చేసావు, కొంతమందికి ఇబ్బంది కదా! ఊర్లో ఎవరికి ఏ ఆపద వచ్చినా ఒకరికి ఒకరు అన్నట్టు ఉన్నాం, ఆలోచించు" అన్నాడు శంకరం.

"అయ్యా శంకరం గారూ, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలని పెద్దలు చెప్పారుకదా, ఈ వరదల కాలంలోనే బాగా సంపాదించు కొంటాను" అని ఆశతో చెప్పాడు.

"సరే నీ ఆలోచన నీది" అని డబ్బులిచ్చి పడవ ఎక్కాడు శంకరం.

కొద్దిరోజుల తరువాత గురవయ్య తన కొడుకుని తీసుకుని శంకరం వైద్యశాలకు వచ్చాడు. శంకరం కొడుకు కళ్ళు ఎర్రగా ఉండి ఆ అబ్బాయికి తీవ్ర జ్వరం ఉన్నది! వాడిని పరీక్షించిన శంకరం, " గురవయ్యా, నీ కొడుకుకు మంచి మందు ఇస్తే అతని జ్వరం,కళ్ళ ఎరుపు తగ్గుతాయి. దానికి ఐదు వందలు అవుతుంది" చెప్పాడు శంకరం.

"అయ్యా, అంత అవుతుందా? ఇంతకు ముందు ఏ జబ్బు గలవారు వచ్చినా తమరు ఏభై రూపాయలు తీసుకునే వారు, నాకు తెలిసి మునుపెప్పుడూ ఇంత తీసుకున్నట్లు ఎవరూ చెప్పలేదు, అందరూ తమరిని దేవుడు అనుకునే వారు" అని వాపొయ్యాడు గురవయ్య.

"గురవయ్యా దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలని పెద్దలు చెప్పారుకదా, ఇప్పుడు సంపాదించుకోక పోతే ఎప్పుడు సంపాదించు కొంటాను?" చిరునవ్వుతో చెప్పాడు శంకరం.

శంకరం అలా ఎందుకన్నాడో గురవయ్యకు అర్థం అయింది."అయ్యా, నాకు బద్ధి వచ్చేట్టు చేసారు, ఇక మీదట ఎవ్వరి దగ్గరా నది దాటించడానికి అంత డబ్బు తీసుకోను అని చేతులు జోడించి అన్నాడు.

"సరే నీ మనసు అర్థం అయింది, వరదల సమయంలో పన్నెండు తీసుకో అది ప్రజలకు భారం కాదు ఒకే సారి రెట్టింపు చేస్తే కష్టం కదా" అన్నాడు శంకరం.

"మీరు చెప్పినట్టే చేస్తా" అన్నాడు గురవయ్య.

"నీ కుటుంబ పరిస్థితి నాకు తెలుసు, నీవు ఐదు వందలు ఇవ్వనక్కరలేదు ఏభై ఇవ్వు చాలు" అని గురవయ్య వీపు మీద తట్టి చెప్పాడు.

శంకరం మంచి మనసుకు గురవయ్య ఎంతో సంతోషించి, నమస్కారం పెట్టి మందులను కొడుకును తీసుకుని వెళ్ళాడు.

**– కంచనపల్లి వేంకట కృష్ణారావు**
**హైదరాబాద్. 9348611445**




# వైభవంగా ధర్మపురి లక్ష్మి నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

### దేవస్థానంలో బ్రహ్మోత్సవ ప్రత్యేక పూజలు

### పట్టు వస్త్రాలు సమర్పించిన జిల్లా కలెక్టర్ యాస్మిన్

**ధర్మపురి మార్చ్ 04(ప్రజా మంటలు):** ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన కళ్యాణోత్సవ వేడుకలలో భాగంగా శనివారం ఉదయం దేవస్థానంలో సాంప్రదాయ ప్రత్యేక పూజలొనరించారు. దేవస్థానం ఎసి ఈ ఓ శ్రీనివాస్, ఇందారపు రామయ్య నేతృత్వంలోని అభివృద్ధి కమిటీ సభ్యుల మార్గదర్శ కత్వంలో యజ్ఞాచార్యులు చక్రపాణి వామనాచార్య, వేద పండితులు రమేశ శర్మ, ముత్యాల శర్మ , కిరణ్, వంశీ, విజయ్, మోహన్, తదితర అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం మునుముందుగా ధ్వజారోహణం, ఉత్సవ సందర్భంగా ప్రత్యేక గరుడస్థంభ పునఃప్రతిష్ఠ, రుక్, యజుర్, సామాధర్వణ వేదాలతో, నలు వైపులా వేద పురుషుల ఆవాహనం, అష్ట దిక్పాలకుల ఆహ్వానం, శేష గద్యము, గరుడ గద్యము, మహా సంకల్పం, అష్ట దిగ్బలులు, బలిహరణాలు, , అన్న ప్రాణ మనో విజ్ఞానా నంద మయముచే సంతానాభిలాషులకు గరుడ దేవానుగ్రహానికై ప్రసాద వితరణ ఆది కార్యక్రమాలను సనాతన పద్ధతిలో నిర్వహించారు.

### పట్టు వస్త్రాలు సమర్పించిన జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మిన్

ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రేయోగానంద. ఉగ్ర లక్ష్మీనర సింహ, శ్రీవెంకటేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన స్వామి వారల కళ్యాణ మహెూరీత్సవ సందర్భంగా. శని వారం రాష్ట్ర ప్రభుత్వ పక్షాన జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ భాషా పట్టు వస్త్రాది కానుకలను సమర్పించారు. 13 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్స వాల సందర్భంగా దేవస్థానానికి చేరుకున్న జిల్లా కలెక్టర్, దేవ స్థానం ఈఓ శ్రీనివాస్, ఇందారపు రామయ్య నేతృత్వంలోని అభివృద్ధి కమిటీ సభ్యులు, సూపరింటెండెంట్ కిరణ్, ముఖ్య అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ళ శ్రీనివాసాచార్యులు, ఆస్థాన వేద పండితులు రమేశ్ శర్మ, ముత్యాల శర్మ, అర్చకులు సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్థానిక ఇసుక స్థంభ ప్రవేశ ప్రదేశం నుండి దేవస్థానం వరకు మంగళ వాద్యాలు తోడురాగా సాంప్రదాయ దుస్తులు ధరించిన కలెక్టర్ పట్టు వస్త్రాలను తలపై పెట్టుకుని నడిచి వెళ్ళారు. ప్రధాన దైవమైన యోగానంద నారసింహాలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజాదికాలలో పాల్గొన్నారు. కలెక్టర్ తో పాటు తహసీల్దార్ వెంకటేశ్, సి ఐ కోటేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రమేశ్ పట్టు వస్త్రాలు సమర్పించారు. కలెక్టర్ ను స్వామి, అమ్మవార్ల శేషవస్త్ర సన్మానితులు గావించి, ప్రసాదం అందజేశారు. అర్చకులు, పండితులు వైదికాశీస్సులు గావించారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఆర్డీఓ మాధురి, తహశీల్దార్ వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్ రమేశ్, ఎంపిడిఓ ప్రవీణ్, దేవస్థానం ఎసి, ఈఓ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ సత్తమ్మ, కౌన్సిలర్లు, సిబ్బంది. అర్చకులు వెంట రాగా, స్థానిక దైవాలకు కానుకలను మోసుకువెళ్ళి పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ రామయ్య, గందె పద్మ, ఇనుగంటి రమ, అక్కెన పెల్లి సురేందర్, వీరవేని కొమురయ్య, చుక్క రవి, సంభంకాడి మహేష్, గుని శెట్టి రవీందర్, పల్లెర్ల సురేందర్, గుంపుల రమేష్, వేముల నరేష్, జైన రాజమౌళి, సంగెం సురేశ్, మున్సిపల్ కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు. ధర్మపురి సి ఐ కోటేశ్వర్, ఎస్ ఐ కిరణ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

### జానపద గీతాలతో, భక్తజన సందోహంతో కిటకిటలాడిన ధర్మపురి క్షేత్రం

ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ నర సింహ (ఉగ్ర, యోగానంద, శ్రీ వెంకటేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన కళ్యాణ మహోరీత్సవ సందర్భంగా శనివారం ధర్మపురి పట్టణం భక్తజన సందోహంతో కిటకిట లాడింది. "తడి బట్ట స్నానాలయ్యో నర సయ్యా, నీ గుళ్ళో పూజలయ్యో, చంకనా పాప లయ్యో నరసయ్యా, నెత్తిమీద ముళ్ళాలివిగో: గండి దాటి మేమొస్తిమో నరసయ్యా, గట్టెక్కించి మమ్ము దోలవో" అంటూ జానపద బాణీలలో రాష్ట్ర తర ప్రాంతాల నుండి ఏతెంచిన భక్తుల భగవన్నామ స్మరణలతో, గీతాలా పనలతో క్షేత్రం మారు మోగింది. ఔరంగాబాద్, చంద్రాపూర్, నాందేడ్ లాంటి సుదూర ప్రాంతాల నుండి ప్రత్యేక మరియు ఆర్టీసి బస్సులలో ప్రాచీన వంశ పారంపర్య ఆచార క్రమంలో వచ్చిన అసంఖ్యా క భక్తులు పవిత్ర గోదావరి నదిలో మంగళ స్నానాలు ఆచరించి, కళ్యాణానికిదైవాల దర్శనార్థం బారులు తీరి వేచి నిలుచున్నారు. కళ్యాణోత్సవ సందర్భంగా దేవస్థానంలోని ప్రధానాలయాలలో పంచోపనిషత్ యుక్త ప్రత్యేక పూజలు, నిత్య ధ్వజారోహణాది కార్యక్రమాలను వేద పండితులు రమేశ శర్మ సంబంధిత ఆలయాల అర్చకులు, దేవ స్థానం ఎసి, ఈఓ శ్రీనివాస్, రామయ్య నేతృత్వంలోని అభివృద్ధి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించారు.

దేవస్థానంలో తాత్కాలిక టెంట్లు, క్యూలైన్లు విద్యుత్ దీపాలు, వివిధ స్టాల్సును ఏర్పాటు చేశారు. జగిత్యాల ఆర్టీసీ డిపో శిబిరం పక్షాన వివిధ డిపోల నుండి నడిపిన ఆర్టీసి బస్సులను రద్దీకి అనుగుణంగా క్రమ బద్ధీకరించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్, పాలకవర్గం పక్షాన భక్తులకు అవ సరమైన సౌకర్యాలు కల్పించారు. జగిత్యాల ఎస్పీ భాస్కర్ మార్గ దర్శ కత్వంలో డీఎస్పీ ప్రకాష్, ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ కోటేశ్వర్ పర్య వేక్షణలో ఎస్ఐ కిరణ్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘట నలు జరిగకుండా బందోబస్తు నిర్వహించారు.



**-ఆర్కె సంగనభట్ల**
**9440595494**

# యడ్డీ రిటైర్మెంటేనా...

తెలంగాణాలో అధికారంలోకి రావడంపై తమ పార్టీ దృష్టిని కేంద్రీకరించినట్టు బీజేపీ మాజీ అధ్యక్షుడు, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఇటీవల ప్రకటించారు.ఆ సంగతి తర్వాత,ముందు కర్నాటకలో ఆ పార్టీ అధి కారాన్ని నిలబె ట్టుకుంటే చాలు. కర్నాటక మాజీ ముఖ్య మంత్రి బీఎస్ యెడియూరప్ప రాజకీయ రిటైర్మెంట్ తీసుకుంటున్నట్టు ప్రకటించడంతో దక్షిణాదిన బీజేపీ బలహీన పడటం ఖాయమన్న విశ్లేషణల్లో నిజమెంతో ఉంది. కర్నాటక బీజేపీలో లుకలుకలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. యెడియూరప్ప లేకపోతే బీజేపీ లేదన్నంతగా ఆయన ఆ పార్టీతో బంధాన్ని



పెనవేసు కున్నారు. బీజేపీకి సైద్ధాంతిక స్ఫూర్తిని ఇస్తున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)లో సాధారణ కార్యకర్తగా జీవితం ప్రారంభించిన యెడియూరప్ప వ యసు ఏడున్నర పదులు దాటడంతో ఇక రిటైరవుతానని ప్రకటించారు.ఇందుకు వేరే కారణాలు ఏవీ కనిపించడం లేదు. ముఖ్యమంత్రి పదవి నుంచి తనను తప్పించడం వల్ల ఆయన అధిష్టానంపై అలిగి ఉన్నారన్న ప్రచారం జరిగింది. ఆయన పార్టీకి ఎంత చేశారో, పార్టీ కూడా ఆయనకు అంతగా అవకాశాలు కల్పించింది.

యెడియూరప్ప నిష్కళంకుడు కాకపోయినా, నిబద్ధత గల పార్టీ నాయకునిగా పేరొందారు.దక్షిణాదిన బీజేపీ కాలూనడానికి ఆయనే కారణం.తమిళనాడు,కేరళలలో బీజేపీ అంటే భగ్గుమనే వారు ఇప్పటికీ ఎంతో మంది ఉన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి ఆదరణ అంతంత మాత్రమే. తెలంగాణాలోనే కొద్దోగొప్పో ఆ పార్టీని ఆదరించేవారున్నారు. అందుకే,తెలంగాణలో అధికా రంలోకి రావడంపై తమ దృష్టిని కేంద్రీకరించామంటూ కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ప్రకటించారు. కర్నా టకలో పార్టీని అందలం ఎక్కించడానికి యెడియూరప్ప ఎంతో కష్టపడ్డారు.ఆయన కష్టానికి గుర్తింపుగానే ముఖ్యమంత్రి అయ్యే అవకాశం అధిష్టాన వర్గం నాలుగుసార్లు కల్పించింది. పార్టీ పునాదులుగా ఆయన సంఘ్ శాఖలను ఉపయోగించుకున్నారు. సంఘ్‌లో అన్ని పదవులను నిర్వహించిన తర్వాతనే ఆయన బీజేపీలో ప్రవేశించారు. సంఘ్‌లో మాదిరిగానే పార్టీలో అకుంఠిత దీక్షతో పని చేశారు. దానికి తోడు లింగాయత్ సామాజికవర్గం అండదండలతో ఆయన ఎదురులేని నాయకునిగా ఎదిగారు.

లింగాయత్ సామాజిక వర్గం గురువు గారైన శివగంగ మఠం అధిపతి ఆశీస్సులతో ఆయన రాజకీయంగానూ, సామాజికంగానూ ఎదిగారు. మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి సోదరుల ప్రమేయం ఉన్న మైనింగ్ కుంభకోణం,తన కుమారుడు రాఘవేంద్రకు ప్రమేయం ఉన్న కుంభకోణాలు ఆయన రాజకీయ జీవితంలో చెరగని మచ్చ వేశాయి. యెడియూరప్ప వివాద రహితుడు. పార్టీకి దక్షిణాదిన పెట్టని కోటగా ఉండేవారు. బీజేపీలో అగ్రనాయకుల నుంచి దిగువ స్థాయి కార్యకర్తల వరకూ అందరితోనూ ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. అదే సంద ర్భంలో కాంగ్రెస్,జేడీఎస్ వంటి ప్రతిపక్షాల నాయకు లతోనూ ఆయన మంచిగానేఉంటూ ముఖ్యమంత్రిగా కొనసాగినంత కాలం ఎటువంటి గొడవలు లేకుండా అందరివాడిగా మెలుగుతూ వచ్చారు.యెడియూరప్ప రిటైర్మెంట్‌వార్త కర్నాటకలోనే కాకుండా దక్షిణాదిన బీజేపీ నాయకులందరిలో పిడుగులా పడింది.ఆయన క్రియా శీలంగా లేకపోయినా, ఆయన సలహాలు, సూ చనలు పార్టీకి ఇక ఉండవేమోనని అందరూ ఆందోళన చెందుతున్నారు. బీజేపీ రాష్ట్ర శాఖలో ద్వితీయ శ్రేణి నాయకులు ఎంతో మంది ఉన్నప్పటికీ, ఆయన మాదిరిగా కలుపుగోలుగా వ్యవహరించేవారు తక్కువ. ప్రస్తుత ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మయ్ రాజకీయ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ, పార్టీపైనా, కార్యకర్తల పైనా ఆయన తన ముద్ర వేయలేకపోయారు.

ముఖ్యమంత్రిగా ఆయన గద్దె నెక్కి ఏడాది మాత్రమే అయినందువల్ల ఆయనకు ఆ అవకాశం రాలేదేమో. అయితే, ఏడాది వ్యవధిలో ఆయన ఎన్నో వివాదాలకు కేంద్ర బిందువు అయ్యారు. ముస్లిం మహిళలు ధరించ??ట హిజాబ్‌ని తప్పనిసరి చేస్తూ ఆయన తెచ్చిన జీవో రాష్ట్ర వ్యాప్తంగా అల్లర్లను సృష్టించింది.అలాగే,రాష్ట్రంలో పలు చోట్ల గాడ్సే విగ్రహాల ఏర్పాటు విషయంలో కూడా ఆయన విమర్శలను ఎదుర్కొన్నారు.పార్టీకి యెడి యూరప్ప వల్ల వచ్చిన మంచి పేరు బసవరాజ్ బొమ్మ య్ హయాంలో కరిగి పోయింది. యడియూరప్ప శిష్యుణ్ణని చెప్పుకుంటూనే ఆయనకు వ్యతిరేకంగా బొమ్మయ్ చాలా నిర్ణయాలు తీసుకు న్నారు.అలాగే, మతపరమైన శక్తులను బొమ్మయ్ ప్రోత్సహిస్తున్నా రంటూ ఆరోపణలు వచ్చాయి. బీజేపీలో అమిత్ షాకి బాగా స న్నిహితంగా ఉండటం వల్లనే యెడియూరప్ప పదవి నిలబడిందనే ప్రచారం అప్పట్లోజరిగింది.అదే అమిత్ షా వల్లనే ఆయన పదవి ఊడిందన్న ప్రచారమూ జరిగింది. కర్నాటకలో బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తుందా అనేది ఊహాజనితమైన ప్రశ్న.యెడియూరప్ప గతంలో సొంత పార్టీని నెలకొల్పారు. ఏమైనా కర్నాటక రాజకీయా ల్లోయెడియూరప్ప బలమైన శక్తిగా ఇప్పటికీ కొనసాగుతున్నారు.

# భక్తులకు ఎల్లవేళలా అండగా భగవంతుడు!

భగవంతుడు ఎల్లవేళలా తనయందు భక్తి కలిగిన వారికి ఏదో రూపంలో అండగా ఉంటూనే ఉంటారు. శరణాగతి కోరుకుంటే అభయం ఇస్తుంటాడు. భక్తితో తనను శరుణు వేడుకున్న వారికి అండగా ఉంటానని మన పురాణాలు, ఉపనిశత్తులు చెబుతున్నాయి. పురాణాలు, ఇతిహాసాల్లో ప్రహ్లాదాదులంతా ఇలాగే భక్తిని చాటారు. భగవంతుడు వారికి అండగా నిలిచాడు. అంటే భక్తికి భగవంతుడు వశమవుతాడన్నది సత్యం. ప్రతిఫలాపేక్ష లేకుండా తనను కొలువుమని గీతాచార్యుడు చెప్పాడు. ఆధునిక కాలంలోనూ ఇదే పద్ధి కొనసాగుతోంది. గుడికి వెళ్లడం భక్తితో చేయాలని అంటారు. భగవంతుని మీద పరిపూర్ణమయిన ప్రేమ కలిగి ఉండడమే భక్తి. అది అమృతానంద స్వరూపం. త్యాగరూపమైనది అయి ఏ కోర్కెలూ లేని స్థితిలో ఉండాలి. అదే మోక్ష అని నారద భక్తి సూత్రాలు చెబుతున్నాయి. భగవద్గీతలోని 'భక్తియోగం' భక్తి తత్త్వాన్నీ, లక్షణాల్నీ విపులంగా తెలిపింది. శ్రీమద్భాగవతం భగవద్భక్తుల లక్షణాలను, భక్తి స్వరూపాన్నీ సవిస్తరంగా ఆవిష్కరించింది. మానవునికి క్రోధం, శోకం లాంటి ఎన్నెన్నో అనుభూతులు ఉన్నా ప్రేమ లాంటి మధురమైన అనుభూతి మరేదీ లేదు! ప్రేమ పొందడం కన్నా ప్రేమించడం ఇంకా మధురం. మానవునికి స్వతహాగా ప్రేమించే లక్షణం ఉన్నా... ఆ ప్రేమ ఒక వ్యక్తికో, ఒక వస్తువుకో మాత్రమే పరిమితమవుతుంది. అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తూ, స్వార్థభావంతో కలుషితమౌతూ, విచ్ఛిన్నమైపోతూ ఉంటుంది. దీనినుంచి బయటపడి ప్రేమతత్వాన్ని అలవర్చుకుంటే భగవంతుడు వశమవుతాడని పురాణాలు చెబుతున్నాయి. నిష్కామంగా ప్రేమించడాన్ని సాధన చెయ్యాలి. ఈ జగత్తులో భగవంతుడు సర్వవ్యాప్తి. సమష్టి రూపమైన భగవంతుని పట్ల... సాధకులు చేసే 'నిష్కామప్రేమ' అనే ఈ ఉపాసనాక్రమానికి కూడా 'భక్తి' అనేదే వ్యవహార నామం. భక్తి సార్వజనీనం, భేదరహితం కావడంవల్ల నిజమైన భక్తిలో లోపాలు ఉండవు. అనంతమైన భగవత్తత్త్వానికి అనంతమైన కళ్యాణ గుణాలు, రూపాలు, నామాలు ఉన్నాయి! వాటిలో రాముడు, కృష్ణుడు, శివుడు, లలిత తదితర సంపూర్ణ దేవతామూర్తుల్ని ఉపాసనా సౌలభ్యం కోసం వేద, పురాణాలు మనకు అందించాయి. భక్తులు తమకు ఇష్టమైన ఒక దేవతా మూర్తిని స్వీకరించి, సమస్త దేవతలనూ, సమస్త జగత్తునూ ఆ మూర్తిలోనే ఉన్నట్టు భావించి, పరదేవతగా ఉపాసించడం ద్వారా భక్తిని కలిగి ఉండాలి. మనసు మరే ఇతర విషయాల మీద, ఇతర దేవతా రూపాల మీద కాకుండా... ఆ ఇష్టదేవతామూర్తి పైనే నిరంతరం లగ్నం కావాలి. భగ వంతుడు అనేక విభూతులలో, అనేక కార్యాలు చేస్తూ, వేర్వేరు పేర్లతో, వేర్వేరు రూపాలతో, వేర్వేరు తత్త్వాలుగా కనిపిస్తాడు. మనం ఏ రూపంలో భక్తితో కొలిస్తే భగవంతుడు ఆ రూపంలో మనకు సాక్షాత్కరిస్తాడు. మానవుడు తాను కల్పించుకొనే మానవ సంబంధాలనే భగవంతునితో కల్పించు కొని... తద్వారా భగవంతునికి మరింత చేరువ కాగలడు. భగవంతునితో అవిచ్ఛిన్నమైన నిరంతర సాన్నిహిత్యం కలిగిన నాడు మానవుడు నిత్యానంద స్థితిని చేరుకుంటాడు.



## నగరంలో నీటి సరఫరాలో ఇబ్బందులు

**పైపు లైన్ పనుల కారణంగా అంతరాయం**

హైదరాబాద్,మార్చి4(ప్రజా మంటలు): నగరంలో వేసవి సమస్యలు మొదలయ్యాయి. ఎప్పటిలాగే ఈసారి కూడా భాగ్యనగరానికి నీళ్ల కష్టాలు ఉండనున్నాయి. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో 8వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 10వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు గోదావరి నల్లా నీళ్లు బంద్ కానున్నాయి. ఈ విషయాన్ని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుతెలిపింది. జీడిమెట్ల, చింతల్, జగద్గిరి గుట్ట, షాపూర్, మల్కాజ్‌గిరి, గాజుల రామారం, దమ్మాయిగూడ, సూరారం, నాగారం, కీసర, బొల్లారం, గుండ్ల పోచంపల్లి, కొంపల్లి, కంటోన్మెంట్, తుర్కపల్లి బయోటెక్ పార్క్, ఎంఈఎస్, ఆలేరు, కొండపాక, కాప్రా మున్సిపాలిటీ ప్రాంతాల్లో నీళ్ల సప్లైకి ఆటంకం కలుగనుంది. మనోహరాబాద్–కొత్తపల్లి మధ్య ప్రతిపాదించిన కొత్త రైల్వే ట్రాక్ పనులు మొదలవ్వనున్నాయి. ఈ ట్రాక్ పనులు ఈ నెలలో ప్రారంభించాలని నిర్ణయించారు. దాంతో కుకునూర్‌పల్లి వద్ద గోదావరి తాగునీటి సరఫరా పథకం–ఫేజ్–1 పైప్‌లైన్ మార్గాన్ని మార్చనున్నారు. ఈ కారణంతో సిటీ పరిసర ప్రాంతాల్లో నీటి సరఫరాకు ఆటంకం కలుగుతుందని వాటర్ సప్లై బోర్డు తెలిపింది.

## హామీల అమలులో కెసిఆర్ విఫలం

**ఎందరో బలిదానాతో ఏర్పడ్డ తెలంగాణ**

**బాగుపడ్డది మాత్రం కెసిఆర్ కుటుంబమే**

**మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శ**



మహబూబాబాద్,మార్చి4(ప్రజా మంటలు): ఇచ్చిన హామీలను అమలుచేయడంలో సిఎం కెసిఆర్ పూర్తిగా విఫలమయ్యారని మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. ఎందరో బలిదానాలతో వచ్చిన తెలంగాణలో కెసిఆర్ కుటుంబమే బాగుపడిందన్నారు. ఈ 9 సంవత్సరాల కాలంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ముఖ్యమంత్రి కెసిఆర్ విఫలమయ్యారని శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారంలో కోరం క్యాంపు కార్యాలయాలన్ని ప్రారంభించిన పొంగులేటి... కేసీఆర్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక మంది బలిదానాలు తర్వాతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిం దని పొంగులేటి చెప్పారు. కేసీఆర్ ఇచ్చిన హామీలు మాటలకే పరిమిత మయ్యాయి కానీ అమలు చేయడంలో విఫల మయ్యారని ఆరోపించారు. గారడి మాటలు చెప్పే ఈ ప్రభుత్వానికి కాలం దగ్గర పడిందంటూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్న పొంగులేటి ... ప్రజాభీష్టం మేరకు తన రాజకీయ ప్రస్థానం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీలను కేసీఆర్ నేరవేర్చలేదని ఆరోపించారు. డబల్ బెడ్ రూమ్.. దళిత బంధు స్కీమ్ అడ్రస్ లేకుండా పోయిందని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం కూలిపోయే సమయం దగ్గర పడిందన్న ఆయన.. నాలుగు సంవత్సరాల నుండి పదవి ఉన్నా.. లేకున్నా.. ప్రజలతోనే ఉన్నానని చెప్పారు. ప్రజలే తనకు దేవుళ్ళని పొంగులేటి అన్నారు.

## టెన్త్‌లో మెరుగైన ఫలితాలు

**పరీక్షల కోసం అధికారుల కసరత్తు**

నిజామాబాద్,మార్చి4(ప్రజా మంటలు): రానున్న పది పరీక్షల్లో జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా చూడాలని డీఈవో అన్నారు. అన్ని ప్రభుత్వ పాటశాల్లో సిలబస్ పూర్తి చేయించి రివిజన్ చేయించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు వారికి నాణ్యమైన, ఉన్నతమైన విద్యను అందించాలని సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ రానున్న వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ప్రతి క్లాసు



నుంచి ఉత్తమ పలితాలు సాధించేలా చూడాలన్నారు. ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. మరోవైపు జిల్లాలోని సర్కారు బడుల్లో చదువుతున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల చదువులు వెనకబడ్డాయి. రెండేళ్లుగా కరోనా కారణంగా పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు నిర్వహించకుండానే పాస్ చేశారు. అయితే ఈ విద్యాసంవత్సరం మాత్రం పదో తరగతి వార్షిక పరీక్షలు పక్కాగా నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో పదో తరగతి విద్యార్థులు మాత్రం ఇంకా సిలబస్ పూర్తికాక పోవడం, పరీక్షలకు తక్కువ గడువే ఉండడంతో ఏవిధంగా పాస్ అవుతామోనన్న ఆందోళన చెందుతున్నారు. దసరా సెలవులు, ముందస్తు సంక్రాంతి సెలవులతో చదువులు అంతంతమాత్రంగానే జరిగాయి. వార్షిక పరీక్షల షెడ్యూల్ సమీపిస్తున్న వేళ ఫలితాలు ఏవిధంగా వస్తాయోనన్న ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.

## ఆయిల్‌పామ్‌తో లాభాల పంట

ఆదిలాబాద్,మార్చి4(ప్రజా మంటలు): ఆయిల్‌పాం పంటలను సాగు చేస్తే రైతులు ఆర్థికంగా ఎదుగుతారని విప్ బాల్క సుమన్ తెలిపారు. ఈ ప్రాంతంలోని రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని అన్నారు. వివిధ గ్రామాల్లో రోడ్లు, కల్వర్టుల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. గొల్లవాగు ప్రాజెక్టుకు అన్నారం బ్యారేజీ నుంచి లిఫ్ట్ ద్వారా నీటిని అందించి సాగునీటికి ఇబ్బందులు పడకుండా చూస్తామని అన్నారు. ఆయిల్ పామ్‌కు దేశంలో మంచి డిమాండ్ ఉందని,పెట్టుబడి కూడా తక్కువేనని అన్నారు. దీనిని గమనించి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ముందుకు సాగాలన్నారు.

## లిక్కర్ స్కామ్‌లో కీలక పరిణామం

**మాగుంట రాఘవరెడ్డి కస్టడీ 14రోజులు పొడిగింపు**

న్యూఢిల్లీ,మార్చి4(ప్రజా మంటలు): ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కీలక పరి ణామం చోటు చేసుకుంది. ఈ కేసులో అరెస్ట్ అయిన మాగుంట రాఘవ రెడ్డి జ్యుడిషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ సీబీఐ కోర్టు పొడిగించింది. మరో 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ పొడిగిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. అంతకుముందు మాగుంటను అధికారులు కోర్టులో హాజరుపరిచ్చారు. రాఘవరెడ్డి తండ్రి ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి కూడా కోర్టుకు వచ్చారు. కేసు దర్యాప్తు పురోగతిలో ఉందని మాగుంట రాఘవ జ్యుడిషియల్ కస్టడీ పొడిగించాలని కోర్టును ఈడీ కోరింది. ప్రస్తుతం మాగుంట తీహార్ జైలులో ఉన్నారు. మార్చి 13న మాగుంట రాఘవ బెయిల్ పిటిషన్‌ను రౌస్ అవెన్యూ కోర్టు విచారించనుంది. ఈ కేసుకు సంబంధించి ఫిబ్రవరి 10న మాగుంట రాఘవరెడ్డిని ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఈ కేసులో ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను కూడా అరెస్ట్ చేసి ఐదు రోజుల పాటు కస్టడీలో ఉంచారు.

## అల్లిపూర్‌లో పదవ తరగతి పరీక్షా కేంద్రానికి సిఫారసు

జగిత్యాల మార్చ్ 04 (ప్రజా మంటలు): రాయికల్ మండలంలోని అల్లిపూర్ ఉన్నత పాఠశాలలో ఈ విధ్యా సంవత్సరం పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా సిఫారస్ చేస్తూ, పరీక్షల సంచాలకులకు లేఖ రాశారు. అల్లిపూర్‌లో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయడంవల్ల సింగా రావుపేట, ఉప్పుమడిగే ఉన్నత పాఠశాలల జిల్లలతో పాటుగా, కస్తూరిభా విద్యాలయామ్ పిల్లల్లు, బీసీ సంక్షేమ విద్యాలయ పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ కేంద్రంలో 195 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని ఆమె తెలిపారు. కలెక్టర్




**ఎవరి సిఫారసు మేరకు కలెక్టర్ లేఖ రాసినట్లు?**

సిఫారస్ మేర అల్లిపూర్ లో పరీక్షా కేంద్రం మంజురు అవుతుందని తెలుస్తుంది. ఈ నేపథ్యంలో రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. ఎవరివల్ల ఇది వస్తుందనేది చర్చించుకొంటున్నారు. అల్లిపూర్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలని పైక్షల సంచలకునికి కలెక్టర్ రాసిన లేఖలో, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఇచ్చిన లేఖల ప్రస్తావన ఉంది. కానీ అంతకు ముందే మండల పరిషత్ లెటర్ హెడ్‌తో ఉన్న ఒక లేఖను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తను సిఫారసు చేస్తూ, పరిశీలించమని జిల్లా విద్యాధికారికి పంపించాడు. కానీ, జిల్లా కలెక్టర్ లేఖలో ఎమ్మెల్యే పంపిన మండల పరిషత్ లేఖ ప్రస్తావన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

## ఐటి హబ్‌తో 750మందికి ఉద్యోగాలు

**నిజామాబాద్‌లో విమానాశ్రయ నిర్మాణానికి పరిశీలన**

**ఐటి హబ్‌ను పరిశీలించిన ఎమ్మెల్సీ కవిత**

నిజామాబాద్,మార్చి4(ప్రజా మంటలు): నిజామాబాద్ ఐటి హబ్‌తో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని ఎమ్మెల్సీ కల్లకుంట్ల కవిత వెల్లడించారు. అలాగే జిల్లాలకు ఐటి విస్తరణ జరగడంతో పాటు, యువతకు ఉద్యోగాలు దక్కనున్నాయని అన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో కూడా ఐటి విస్తరణకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రూ. 50 కోట్లతో నిర్మిస్తున్న ఐటీ హబ్‌ను త్వరలో ప్రారంభించనున్నా మని ఎమ్మెల్సీ కల్లకుంట్ల కవిత వెల్లడించారు. శనివారం నిజామాబాద్‌లో ఐటీ హబ్ భవన సముదాయాన్ని త్వరలో కేటీఆర్ చేతుల మీదుగా ఐటీ హబ్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు. రూ. 50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఐటీ హబ్‌లో 750 మంది యువతకు, నాలుగు వేల మంది ఇతర ప్రాంతవాసులకు ఉద్యోగ, ఉపాధికి అవకాశం లభిస్తుందని తెలిపారు.' ఇంకా ఎన్నో పరిశ్రమలు నిజామాబాద్‌కు రానున్నాయి. ఇప్పటికే 200 పై చిలుకు సీట్లు ఒప్పందాలు పూర్తి అయ్యాయని అన్నారు.దేశ వ్యాప్తంగా ఐటీ ఎక్స్‌పోర్ట్‌లో రాష్ట్రం రెండవ స్థానంలో ఉందని కవిత తెలిపారు. తెలంగాణలో కలలు కన్న ప్రగతి సాధ్యమౌతుందని అన్నారు.డిగ్రీ కళాశాల లతో ఒప్పందాలు





నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, బీఆర్ఎస్ ఎన్నారై సెల్ కో ఆర్డినేటర్ మహేశ్ గుప్తాతో కలిసి పరిశీలించారు. చివరి దశకు చేరుకున్న పనులను, భవనంలో మౌలిక సదుపాయాల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ కంపెనీలను తీసుకువెళ్లాలని సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఐటీ హబ్ లను నిర్మిస్తున్నారని కవిత పేర్కొన్నారు.

నిజామాబాద్‌లో ఐటీ హబ్ నిర్మాణానికి ఎంతో శ్రద్ధ తీసుకున్న సీఎం కేసీఆర్, కేటీఆర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అతి పెట్టుకుంటామని ఆమె వివరించారు.

జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటు అంశాన్ని కూడా పరిశీలిస్తున్నా మని ఎమ్మెల్సీ తెలిపారు. త్వరలో ఇంకా ఎన్నో పరిశ్రమలు నిజామాబాద్‌కు రానున్నాయని, ఇప్పటికే 200 పై చిలుకు సీట్లు ఒప్పందాలు పూర్తి అయ్యాయని అన్నారు. దేశ వ్యాప్తంగా ఐటీ ఎక్స్‌పోర్ట్‌లో రాష్ట్రం రెండవ స్థానంలో ఉందన్నారు. మరోవైపు జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటు అంశాన్ని కూడా పరిశీలిస్తున్నా మని కవిత చెప్పారు.

## మహిళా సంక్షేమంలో ముందున్న తెలంగాణ

**మహిళలకు అండగా అనేక పథకాల అమలు**

**మంత్రి సత్యవతి రాథోడ్ వెల్లడి**

హైదరాబాద్,మార్చి 4(ప్రజా మంటలు): తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ, సంరక్షణ పథకాలు అద్భు తంగా అమలవుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలకు టీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. మహిళారక్షణతో పాటు, వారి కోసం చేపట్టిన వివిధకార్యక్రమాలపై అవగాహనా కార్యక్రమాలను చేపట్టనున్నారు. కళ్యాణలక్ష్మి ద్వారా 10 లక్షల మంది పేదింటి ఆడబిడ్డలకు పెళ్లి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇలా చేయడం దేశంలోనే తొలిసారని పేర్కొన్నారు. సుమారు 11లక్షల మంది మహిళలకు కేసీఆర్ కిట్ పథకం అమలైందన్నారు. ఇంతటి ఘనమైన మహిళా సంక్షేమ మైలురాళ్లను చేరుకున్న నేపథ్యంలో, ఈసారి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని బిఆర్ఎస్ భావిస్తోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాల్లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు, డాక్టర్లు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, స్వయం సహాయక సంఘాల నాయకురాళ్లతో పాటు ప్రతిభ కలిగిన విద్యార్థినిలు, తదితర మహిళలకు గౌరవపూర్వక సన్మానం నిర్వహించాలని అనుకుంటున్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాల లబ్దిదారుల నివాసాలకు టీఆర్ఎస్ నాయకులు నేరుగా వెళ్లి కలవనున్నారు. అనంతరం లబ్దిదారులతో ముచ్చటించి, సెల్ఫీలు తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 8న నియోజకవర్గ స్థాయిలో మహిళలతో సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా తన రాజకీయ అనుభవంలో ఎదురైన క్షేత్రస్థాయి సమస్యలకు పరిష్కారం ఇస్తున్న గొప్ప పాలకుడు మన ముఖ్య మంత్రి కేసీఆర్ అని మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. క్షేత్ర స్థాయి సమస్యలకు అద్భుతమైన పరిష్కారం చూపిస్తూ అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను రూపకల్పన చేశారని కొనియా డారు. అందులో భాగంగానే మహిళా సంక్షేమానికి సంబంధించి అపూర్వమైన కార్యక్రమాలను మన ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఆడబిడ్డలకు నీటి కష్టాలను దూరం చేసేందుకు మిషన్ భగీరథ పథకాన్ని అమలు



చేసి, విజయవంతం చేశారు. మాతా శిశు సంరక్షణ కోసం కేసీఆర్ కిట్ పథకం అమలు చేశామన్నారు. ఈ పథకం అమలుతో మాతా శిశు మరణాలు తగ్గాయి.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సురక్షిత ప్రసవాలు పెరిగాయని కేటీఆర్ గుర్తు చేశారు. కల్యాణలక్ష్మి కార్యక్రమం ఒక గొప్ప మైలురాయిని చేరుకుంది. ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు ఆసరా పింఛన్లు ఇస్తున్నది. వడ్డీ లేని రుణాలను స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్నదని తెలిపారు. మహిళా సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా షీటీమ్స్, భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని మంత్రి గుర్తు చేశారు. విద్యాశాఖలోనూ అద్భుతమైన కార్యక్రమాలను చేపట్టినట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు, బాలికలకు ప్రత్యేకంగా రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్రం బేటీ బచావో బేటీ పడావో అంటూ కేవలం నినాదాలు ఇస్తున్న సమయంలో నిజంగా విద్యార్థులను చదివించి, సంరక్షిస్తున్న ప్రభుత్వం మనదే అని మంత్రి సత్యవతి స్పష్టం చేశారు. రాజకీయ, పారిశ్రామిక రంగాలలోనూ మహిళల కోసం అనేక కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు.

## గ్యాస్ ధరల పెంపు పేదలకు భారం

**ఎన్నికల తరవాత పెంచడం బిజెపి అలవాటు**

**ఇరిగేషన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ చారి విమర్శలు**

హైదరాబాద్,మార్చి4(ప్రజామంటలు): ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన వెంటనే గ్యాస్ ధరలు పెంచారని ఇరగినేషన్ డెవలప్



మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్, కేంద్రమాజీమంత్రి వేణుగోపాలాచారి అన్నారు. ఇవి పెరుగుతాయని తమకు ముందే తెలుసని అన్నారు. గతంలో ఎన్నికల ముందు ఇలాగే జరిగిందన్నారు. ఇప్పుడు కూడా అదే జరుగుతుందని అన్నారు. ఎన్నికల ముందు అలవికాని హామీలు ఇవ్వడం, ఎన్నికలయ్యాక ధరలతో మోదడం మోడీకి అలవాటుగా మారిందన్నారు. బండి సంజయ్, రేవంత్ రెడ్డిలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏ ఒక్కటి లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై రెండు పార్టీల నాయకులు చర్చకు రావాలని సవాల్ విసిరారు. పెట్రోల్, డీజిల్, ఎరువులు, వంట గ్యాస్ ధరలు పెంచిన కేంద్ర ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తుందని మండిపడ్డారు. విద్యుత్ సంస్కరణల పేరిట కేంద్రం తెలంగాణ ప్రభుత్వాన్ని మభ్యపెడుతుంది. ఐదేళ్లలో రూ.25 వేల కోట్లు ఇస్తామంటూ రైతుల బావుల దగ్గర మీటర్లు పెడుతున్నదని ఆరోపించారు. ఒక పూట ఉపాసం ఉంటాం కానీ, రైతులకు అన్యాయం చేసేది లేదని సీఎం కేసీఆర్ గతంలోనే చెప్పారు. రాష్ట్రంలో యాసంగి వడ్లను కొనకుండా బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. బీజేపీ నాయకులు మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ది పొందాలని చూస్తుందన్నారు. మనకు విద్వేషాలు, కొట్లాటలు ముఖ్యం కాదు. గలగల పారే గోదావరి జలాలు కావాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ అభివృద్ధి చెందుతోందని చారి అన్నారు.

దేశంలో బీజేపీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇలాంటి సౌకర్యాలు లేవన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టి స్వార్థం కోసం పని చేస్తున్న పార్టీ బీజేపీ అని మండిపడ్డారు. గ్రామాలలో బిఆర్ఎస్ కార్యకర్తలు చర్చలు పెట్టి కాంగ్రెస్, బీజేపీ నాయకులను ఎక్కడిక్కడే నిలదీయాలని మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణలో రూ.2016 పెన్షన్ ఇస్తున్నామని తెలిపారు. మహారాష్ట్ర సరిహద్దు రైతులు తెలంగాణలో భూములు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ఉచిత కరెంటును ఉపయోగించుకుంటున్నారన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం మళ్లీ గ్యాస్ ధరలు పెంచడం దారుణమని విమర్శించారు.

## బస్సును ఢీకొన్న ట్రక్కు

**ఏడుగురు వ్యక్తులు దుర్మరణం**

అంబాలా,మార్చి4(ప్రజా మంటలు): హర్యానాలోని అంబాలాలో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. శనివారం ఉదయం అంబాలా వద్ద మయునా నగర్–పంచకుల జాతీయరహదారిపై ఓ బస్సును ట్రక్కు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుగురు మృతిచెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం ధాటికి బస్సు నుజ్జునుజ్జు అయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హనుమకొండలో యువకుడి ఆత్మహత్య

హన్మకొండ,మార్చి4(ప్రజా మంటలు): హనుమకొండలో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. హనుమకొండ సమీపంలోని కోటి పల్లిలో నరేశ్ అనే యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసు కున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని హనుమ కొండలోని గుడిబండల్‌కు చెందినవాడిగా గుర్తించారు. మహేశ్వరం బిట్స్ కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతున్నాడని, ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమని భావిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రేవంత్ కాన్వాయ్‌లో ప్రమాదం

**వరుసగా ఢీకొన్న కార్లు..తప్పిన ముప్పు**

రాజన్నసిరిసిల్ల,మార్చి4(ప్రజా మంటలు): టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కాన్వాయ్‌కు పెనుప్రమాదం తప్పింది. శనివారం ఉదయం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పాదయాత్రలో భాగంగా రేవంత్ శ్రీపాద ప్రాజెక్టు



సందర్శనకు బయలుదేరి వెళ్లారు. ఈ సమయంలో రేవంత్ రెడ్డి కాన్వాయ్‌లో కార్లు ప్రమాదవశాత్తు వరుసగా ఢీకొన్నాయి. అతివేగం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదం జరిగిన వెంటనే కాన్వాయ్‌లోని బెలూన్లు తెరుచుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో నాలుగు కార్లు ధ్వంసమయ్యాయి. పలు మీడియా కార్లకూ ప్రమాదం చోటు చేసుకుంది. కాగా... ఎవరి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం రేవంత్ వేరే కారులో శ్రీపాద ప్రాజెక్ట్ సందర్శనానికి వెళ్లారు.

## చందానగర్‌లో కారులో మంటలు

హైదరాబాద్,మార్చి4(ప్రజా మంటలు): చందానగర్‌లో ఆగి ఉన్న కారులో మంటలు చెలరేగాయి. చందానగర్ మున్సిపల్ అఫీస్ వద్ద పార్క్ చేసి ఉన్న టాటా ఇండిగో కారులో ఉన్నట్టుండి మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం సమయంలో కారులో ఎవరు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. మంటలను ఆర్పేందుకు కొందరు స్థానికులు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే.. పెద్ద ఎత్తున చెలరేగిన మంటల్లో కారు పూర్తిగా దగ్ధమైంది. కారులో ఇలా మంటలు రావాడానికి చాలా కారణాలున్నాయి. ముఖ్యంగా సమ్మర్ లో సర్వీసింగ్ చేయకుండానే వేల కిలోమీటర్లు నడపడం కూడా ఇటువంటి ఘటనలకు దారితీస్తాయి. అంతేకాకుండా కార్ల టైర్లు సరిగ్గా లేకపోవడం, అరిగిపోయిన టైర్లతో ఎక్కువ దూరం ప్రయాణం చేసినప్పుడు టైర్లకు రోడ్డుకు మధ్య స్పార్క్స్ ఏర్పడి కూడా మంటలు వ్యాపించడానికి అవకాశం ఉంది. ఇక వాహనాల తయారీలో వినియోగించే ప్లాస్టిక్, ఫోమ్, ఎలక్ట్రికల్ వైరింగ్, ఫాబ్రిక్ కారణంగా అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి లాంగ్ డ్రైవ్ కు వెళ్లేముందు ఒకటికి రెండుసార్లు అన్ని చెక్ చేసుకుని వెళ్లడం మంచిందని నిపుణలు సూచిస్తున్నారు.

## నాలాల విస్తరణతో ముంపు సమస్యకు పరిష్కారం

**మినిస్టర్ రోడ్డు నాలా పనులు పరిశీలించిన తలసాని**

హైదరాబాద్,మార్చి4(ప్రజా మంటలు): నగరంలో వరద ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మంత్రి కేటీఆర్ చొరవతో నాలాల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి తలసాని



శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పికెట్ నాలాపై వంతెన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి ఏప్రిల్ చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.శనివారం మినిస్టర్ రోడ్ లో గల పికెట్ నాలా పై ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం క్రింద చేపట్టిన వంతెన నిర్మాణ పనులు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది పెంచి పనులు వేగంగా చేపట్టాలని సూచించారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో నాలా కు ఎగువ నుంచి వచ్చే నీరు సక్రమంగా వెళ్లక పరిసర కాలనీలు ముంపునకు గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కరాచీ బేకరీ వద్ద పికెట్ నాలాపై రూ. 10 కోట్ల వ్యయంతో నాలాలోని నీరు ఎలాంటి ఆటంకాలు లేకుండా వెళ్లిపోయే విధంగా నూతనంగా వంతెనను నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. మినిస్టర్ రోడ్‌లో ఉన్న పాత వంతెన ను తొలగించి గతంలో ఉన్న దానికంటే ఎత్తులో, వాహనాల రాలపోకలు సులువులుగా సాగేలా వెడల్పుగా నిర్మిస్తున్నట్లు చెప్పారు. వంతెన నిర్మాణంతో అన్నా నగర్, రసూల్ పురా బస్తీ, ఇక్రిశాట్, తదితర అనేక కాలనీలకు ముంపు సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని చెప్పారు. బేగంపేట నాలా పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. నాలా వెంట ఉన్న కాలనీలలో డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్ పనులు పూర్తయ్యాయని, రోడ్డు నిర్మాణం పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన నాలాల నిర్వహణను గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం, ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు కూడా వరద ముంపు సమస్యకు ఒక కారణంగా పేర్కొన్నారు. మంత్రి వెంట బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఎన్‌డీపీ సీఈ కిషన్, వాటర్ వర్క్స్ డైరెక్టర్ కృష్ణ, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ జీఎం రమణా రెడ్డి, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డీఈ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## చేసిన సేవలే మనిషికి గుర్తింపును తెస్తాయి

**సికింద్రాబాద్ మార్చి 04 ( ప్రజామంటలు):** వ్యక్తి తాను పనిచేసే రంగంలో వృత్తితో పాటు సామాజికంగా చేసిన సేవ పనులే గుర్తింపును ఇస్తాయని ఆలిండియా



ముదిరాజ్ సమాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం హైకోర్టు ప్రముఖ న్యాయవాది ఎస్.శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ఆయన్ని కలిసిన వెంకటేశ్వర్లు శాలువాతో సత్కరించి, బర్త్ డే గ్రీటింగ్స్ చెప్పారు. తన వద్దకు వచ్చే నిరుపేద క్లయింట్లకు మానవతాదృక్పదంతో సాయమందించే శ్రీనివాస్ మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## మున్సిపల్ కమిషనర్‌కు ఆర్యవైశ్య సంఘ సన్మానం

**మెట్ పల్లి మార్చి 04 ( ప్రజామంటలు):** మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ ను మున్సిపల్ కార్యాలయంలో శనివారం



మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్యవైశ్య సంఘ కమిటీ ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో అధ్యక్షులు కోట సుమన్ సల్వా తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి ముక్క పవన్, వాసవి దేవాలయ అధ్యక్షులు వెలగందుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కే.యూ. మహిళా ఇంజనీరింగ్ విద్యార్థినికి ‘బెస్ట్ ఎథికల్ హకర్’ జాతీయ అవార్డు

**హన్మకొండ మార్చి 04 (ప్రజామంటలు):** కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఐటీ విద్యార్థిని సాత్విక సాయి కి టి.సి. ఎస్ “బెస్ట్ ఎథికల్



హకర్ గా జాతీయ స్థాయి అవార్డు లభించింది. టిసిఎస్ సాఫ్ట్ వేర్ కంపెనీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో అవార్డ్ నిర్వహించిన టిసిఎస్ హాక్ సీజన్ -7 రెండు రౌండ్ల వర్చువల్ పోటీలలో వివిధ రాష్ట్రాల నుండి ఎథికల్ హ్యాకింగ్ ప్రతిభావంతులు 58 వేల మంది పాల్గొన్నారు. ఈ పోటీలలో కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం నుండి ఫోర్త్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని ఏం సాత్విక సాయి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మహిళా విభాగంలో జాతీయస్థాయిలో నాల్గవ ర్యాంకు సాధించి అవార్డు మరియు పదివేల రూపాయల నగదు బహుమతి గెలుచుకున్నారు. కే యూ వీ.సీ. ప్రొ. తాటికొండ రమేష్, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ యం.సదానందం, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

## ముదిరాజ్ భవన్‌లో ముగ్గుల పోటీలు

**సికింద్రాబాద్ మార్చి04 (ప్రజామంటలు):** మహిళా దినోత్సవం సందర్భంగా న్యూ బోయిగూడ లోని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ముదిరాజ్ భవన్ లో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు మహిళా



దినోత్సవం రోజున బహుమతులను అందచేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహిళా విభాగం అద్యక్షురాలు మేకల శారధ, జాతీయ ముదిరాజ్ సమాజ్ ఈసీ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్లు, ముదిరాజ్ నాయకులు టి. సురేందర్, డి.బాలకృష్ణ, రాజారాం, సత్యం, నిర్మల, ఉమా తదితరులు పాల్గొన్నారు.

## కరువు నేలలో మానస సరోవరం

**డిస్కవర్ మ్యాన్, పర్యావరణ ప్రేమికుడు: రెడ్డి రత్నాకర్ రెడ్డి**

**జనగామ మార్చి 04 (ప్రజామంటలు):** జనగామ జిల్లా రఘునాథ్ పల్లి మండలం అశ్వరావు పల్లిలోని రిజర్వాయర్ కరువు ప్రాంతమైన ఈ జిల్లాలో అందమైన ప్రకృతి దృశ్యాలకు నెలవుగా మారింది.కరువు నేలలో మానస సరోవరంమని డిస్కవర్ మ్యాన్,పర్యావరణ ప్రేమికుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి వివరించారు. జనగామలో శనివారం ఈ విషయాలను వివరించారు. ఎక్కడో మంచు కొండల్లో ఉండే మానస సరోవరం కరువు నేలలో ఉండడం ఆశ్చర్యమే! రాజస్తాన్ కన్నా తక్కువ వర్షపాతం నమోదైన ప్రాంతానికి ఇది నిజంగానే మానస సరోవరం. అవును! అట్లనే ఉంటది. చుట్టూరా దట్టమైన అడవితో కప్పుకున్న కొండలు. కొండలే దోసిట పట్టగా ఏర్పడిన సరోవరం. ప్రకృతి ప్రేమికుల మనసు సప్తాశ్వములను పూని పరుగులు తీస్తుంది. బుడుబుంగలు కొంగలు వాలిన బండలు చూపు తిప్పుకోనివ్వవు. వెండి రంగు కాండంతో మెరిసే చెట్ల సమూహం మరులు గొల్పుతది. ఈ సరోవరంలో బోట్ వేసుకొని ఒక చుట్టు చుట్టాలని మనసు ఉవ్విళ్లూరుతది. ఈ సాహస యాత్ర లెక్క లేనన్ని మధురానుభూతులను అందిస్తుంది. ఈ మానస సరోవరం ఎక్కడో లేదు. జనగామ జిల్ల, రఘునాథ్ పల్లి మండలం అశ్వరావు పల్లిలోని రిజర్వాయర్ ఇది. కరువు ప్రాంతమైన జనగామ జిల్లాలో అందమైన ప్రకృతి దృశ్యాలకు నెలవుగా మారింది. ప్రతీ ఏటా జనగామ ప్రాంత విద్యార్థులు , పర్యాటకులు దూర ప్రాంతాల సందర్శనకు వెళుతుంటారు. తమ సమీపంలో ఉన్న ప్రాంతాల గురించి సమాచారం లేకపోవడం మూలంగా ఇలా జరుగుతున్నది. ఈ పరిస్తితి మారాలి. దూర ప్రాంతాల వారే జనగామకు వచ్చేలా చేసే పర్యటక ప్రాంతం ఇది. నా యాత్రలో నేను అనేక విషయాలు తెలుసుకున్నాను. ఇక్కడి అడవుల్లో అరుదైన వృక్ష జాతులు, అనేక రకాల వన్య ప్రాణులు ఉన్నాయి.నా తోవలో ఒక సన్నని పొడవైన పాము వేగంగా కదిలి పోయింది.వంద సంవత్సరాలకు ఒకసారి పూసే సెంచరీ ప్లాంట్స్ ఈ అడవుల్లో పెరుగుతున్నయి.6 అడుగుల పొడవున్న ఆకులతో , పది అడుగుల ఎత్తైన ఈ మొక్క 25 అడుగుల పొడవైన పూల కాండం కలిగి ఉన్నవి. సెంచరీ ప్లాంట్ నీ స్థానికులు రాకాసి మట్ట అని పిలుస్తారు. వీటి యొక్క రెండు కాండాలను కలిపి పడవ చేసుకొని చేపలు పడుతున్నారు. ఈ కారణంగా వీటిని తొలగిస్తున్నారు. రానున్న ఆగస్ట్ మాసం వరకు అశ్వరావుపల్లి రిజర్వాయర్ ను “ఎకో టూరిజం” కింద అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించడానికి



ప్రభుత్వం కృషి చేయాలి. పర్యాటకుల కోసం ప్రత్యేకంగా ఆగస్టు సెప్టెంబర్ మాసాల్లో ఒక పడవను ఏర్పాటు చేయాలి. గుట్టలపై బర్డ్స్ వాచ్ టవర్ నీ ఏర్పాటు చేయాలి.నీటి ఎద్దడిని తట్టుకునే వివిధ రకాల కాక్టస్ మొక్కలు, మొగిలి చెట్లు మొదలైన ఇతర ఆకర్షణీయమైన మొక్కలు నాటాలి. అడవి లోని కొన్ని ప్రాంతాలకు ఆసక్తి కలిగించే పేర్లు పెట్టాలి. ఎన్ని రకాల చెట్లు ఉన్నాయో వాటిని గుర్తించి, వాటి ఉపయోగాలు తెలియజేసేలా గైడ్ చెసే వారిని అందుబాటులో ఉంచాలని రెడ్డి రత్నాకర్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన

**కోరుట్ల మార్చి 04 (ప్రజామంటలు):** ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తనయుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, యువనాయకుడు డాక్టర్ సంజయ్ చేతుల మీదుగా వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో డాక్టరు సంజయ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ముమ్మందు కూడా మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. యశోద ఆసుపత్రి వైద్యులు సుమారు 3,వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. యువ నాయకులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లడుతూ.... తదుపరి చికిత్స అవసరమయిన వారికి హైదరాబాద్ లో చికిత్స అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అన్నమ్ లావణ్య అనిల్, వైస్ చైర్మన్ గడ్డమీద పవన్,



మున్సిపల్ కమిషనర్ అయాజ్, పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, స్థానిక కౌన్సిలర్లు, టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్రల నాయకులతో తస్మాత్ జాగ్రత్త

### మంత్రి గంగుల కమలాకర్ హెచ్చరిక

**కరీంనగర్,మార్చి 04 (ప్రజామంటలు):** పాదయాత్రల పేరిట వస్తున్న పార్టీల నాయకుల మాయమాటలకు మోసపోతే మళ్లీ గోస పడతాం. వారితో జాగ్రత్తగా ఉండాల’ ని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఒక్కసారి తప్పు జరిగితే పిల్లల భవిష్యత్ అంధకారంలోకి వెళ్తుందని అలాంటి అవకాశం ఇవ్వవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. శాసన మండలి చీఫ్ విప్ గా ఎన్నికైన తానిపర్తి భానుప్రసాద్ రావు మొదటిసారి పెద్దపల్లి జిల్లాకు వచ్చిన సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన రానున్న ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలిచి సత్తా చాటుతామని అన్నారు. నిరంతరం తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం పరితపించే కేసీఆర్ కు అండగా ఉండాలని కోరారు . తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి స్థానం లేదు.. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ సర్కారే అని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీజే, కాంగ్రెస్ పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో



సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఆంధ్రోళ్ల కళ్లు మళ్లీ తెలంగాణ పై పడ్డాయని ఆరోపించారు. తెలంగాణను మరోసారి దోచుకునేందుకు పాదయాత్ర ల పేరిట గ్రామాలకు వస్తున్నారని వెల్లడించారు. స్వయంపాలనలో ముఖ్యమంత్రి కేసీఆఆర్ ముందు చూపుతో 24 గంటల కరెంటుతో భూమికి భరువయ్యే పంట పండుతోందని అన్నారు. ఆనాడు ఆంధ్ర పాలకుల వల్ల పంటలకు నీరు వచ్చేది కాదని అన్నారు. నీళ్లు ఉంటే కరెంట్ ఉండదు. పండిన పంట కొనే పరిస్థితిలో ఉండేది కాదని గుర్తు చేశారు. చేరుతున్నారని మంత్రి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన ఏడో వార్డు సభ్యులు మౌనిక కిరణ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారికి తప్పకుండా సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి వద్దపెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత,ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, కొరుకంటి చందర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధు తో పాటు బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

## చింతలపల్లి గ్రామంలో మహిళా దినోత్సవ ర్యాలీ

**కొడిమ్యాల మార్చి 04 (ప్రజామంటలు):** విలేకరి జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చింతలపల్లి గ్రామం లోని అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ మల్యాల ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మహిళా



దినోత్సవ వేడుకలను నిర్వహించి ర్యాలీ తీయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడి సూపర్వైజర్ ఉమ కార్యక్రమమునకు హాజరైన మహిళలకు మహిళా సాధికారతను గురించి లింగ వివక్షతను గురించి మహిళా హక్కులు మహిళా టోల్ ఫ్రీ నెంబర్ 181 గురించి, అంతర్జాతీయ స్థాయిలో మహిళలు సాధించిన విజయాలను గురించి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐకెపి.సిసి శ్రీనివాస్ చింతలపల్లి కార్యదర్శి రాజేష్ పాఠశాల ఉపాధ్యాయులు మమతా సుమలత వివోఏ వాసవి ఆశా కార్యకర్తల అంగన్వాడీ టీచర్స్ సుజాత హెల్పర్ నరసమ్మ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఎం.ఎల్.సి. ఎన్నికల ప్రచారం

**జనగామ మార్చి 04 (ప్రజామంటలు):** పిఆర్టియు టిఎస్ జనగామ మండల శాఖ అధ్యక్షుడు బొగ్గారపు శ్రీనివాసు ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్, హైదరాబాదు, రంగారెడ్డి శాసనమండలి ఎన్నికల ప్రచారం పలు పాఠశాలల్లో నిర్వహించారు. ఈ



కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొల్ల మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో ముందుండే సంఘం పిఆర్టియుటిఎస్ అని, ఈనెల 13 వ తేదీన జరిగే శాసనమండలి ఎన్నికలలో పిఆర్టియుటిఎస్ అధికారిక అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి కి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జలీల్ రాష్ట్ర బాధ్యులు పసున్నురి సోమరాజు, క్రిష్ణమూర్తి, గైని విజయశ్రీ, సారయ్య, ఉస్మాన్, నీత, నర్సిరెడ్డి, ఐత నర్సింహ్ములు, స్టుడి సత్యనారాయణ పాల్గొన్నారు.

## మహిళా సాధికారతపై పరిశోధనకు డాక్టరేట్

**ఓయూ నుంచి డాక్టరేట్ పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ చిలువేరి ప్రవీణ**



**కరీంనగర్ మార్చ్ 04 (ప్రజా మంటలు) :** ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వర్తిస్తున్న చిలువేరి ప్రవీణకు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా ప్రొఫెసర్ లక్ష్మి పర్యవేక్షణలో ?ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ త్రూ ఎంటర్ప్రెన్యూర్ షిప్ ఏ కేస్ స్టడీ ఇన్ హైదరాబాద్??అనే అంశంపై చిలువేరి ప్రవీణ పరిశోధనను చేశారు. ఈ పరిశోధనకుగాను ఓయూ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రవీణను ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అభినందించారు.

## నవీన్ హత్యలో యువతికి సంబంధం లేదు

**వివరాలు రాబడుతున్నామన్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్**

**హైదరాబాద్,మార్చ్ 04 (ప్రజా మంటలు) :** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన బీటెక్ స్టూడెంట్ నవీన్ హత్య కేసుతో యువతికి ఎలాంటి సంబంధం లేదని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ స్పష్టం చేశారు. హత్యలో యువతి పాత్రపై ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. నిందితుడు హరిహర కృష్ణ నుంచి మరిన్ని వివరాలు రాబడుతున్నామని ..అతడికి సహకరించిన వారిపై కేసులు నమోదు



చేస్తామని చెప్పారు. ఈ కేసు దర్యాప్తు జరుగుతుందని.. ఇపుడే స్పందించలేమన్నారు. ఈ కేసుకు సంబంధించి నిన్న పోలీసులు సీన్ రికన్ స్ట్రక్షన్ పూర్తి చేశారు.నవీన్ హత్యకు అమ్మాయికి సంబంధం ఉండొచ్చని నిందితుడు హరిహర కృష్ణ తండ్రి ఆరోపించారు. అలాగే నిందితుడు నవీన్ ను హత్య చేసిన తర్వాత అమ్మాయితో మాట్లాడినట్లు ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో నవీన్ హత్యకు అమ్మాయికి ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తులో నవీన్ హత్యకి అమ్మాయికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవని చెప్పారు.

# హిందుత్వానికి ఏ ఒక్కరూ ఛాంపియన్ కాదు

**చెట్టుపేరు చెప్పకుని కాయలు అమ్ముకునే వారితో జాగ్రత్త**

**శోభకృత్ క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి జగదీశ్ రెడ్డి**

**నల్లగొండ,మార్చి04 (ప్రజామంటలు):** హిందుత్వానికి ఏ ఒక్కరూ ఛాంపియన్ కాదని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు. హిందుత్వాన్ని రాజకీయాల్లోకి దూర్చి కొందరు హిందుత్వ గౌరవాన్ని దిగజారుస్తున్నారని ఆయన మండిపడ్డారు. చెట్టుపేరు చెప్పుకుని కాయలు అమ్మే వారు ఇటువంటి కుట్రలకు తెర లేపుతున్నారని ఆయన దుయ్యబట్టారు. శనివారం సాయంత్రం నల్లగొండ జిల్లా కేంద్రంలోనీ వేద పాఠశాల ప్రాంగణంలో తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం, దేవాలయ దీప, ధూప మత్తైక అర్చక ఉద్యోగుల సంఘం



ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ శోభాక్రుత్ కాల నిర్ణయ పంచాంగాన్ని మంత్రి జగదీష్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. భారతీయ విలువలు అంటేనే హిందుత్వానికి ప్రతీక అని ఆయన కొనియాడారు. వేల సంవత్సరాల నుండే ఇది విరాజిల్లుతుందన్నారు. మానవ సమాజం మొదలైన రోజు నుండే భారతదేశంలో విలువలకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. పాశ్చాత్య పోకడలు పోయిన వారు కుడా కాల క్రమంలో సనాతన హిందు విలువలకు పెద్ద పీట వేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నక్షత్రాలలో జరుగుతున్న మార్పులను పట్టే పంచాంగం రూపొందించడం భారతీయ సమాజంలో అనాదిగా వస్తుందాన్నారు. వాటిని శాస్త్రీయంగా అధ్యయనం చేసిన మీదటనే కాల నిర్ణయంతో పాటు భూత భవిష్యత్ వర్తమాన కాలాలను నిర్దేశిస్తారన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలో ఇక్కడ వేదపాఠశాల నెలకొల్పడం జరిగిందన్నారు. శాశ్వతమైన భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని మంత్రి జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలా చారి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ రంగంలో లక్షలాది ఉద్యోగాల కల్పన

**మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వెల్లడి**

**ఖమ్మం,మార్చి04 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో లక్షలాది ఉద్యోగాలు కల్పించామని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. ఖమ్మంలోని విజయ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఒకే రోజు మూడు వేల



ఉద్యోగాలు కల్పించడం అభినందనీయమన్నారు. 40 కంపెనీలు విజయ కాలేజీ జాబ్ మేళాకు హాజరు కావడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగం అంటే ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగం మాత్రమేనని, కానీ ఇప్పుడు లక్షల్లో జీతాలు ఇస్తూ ప్రైవేట్ కంపెనీలు పోటీ పడుతున్నాయని మంత్రి అన్నారు. మంత్రి కేటీఆర్ ప్రతి రోజు ఏదో ఒక కంపెనీని ప్రారంభించడం, శంకుస్థాపన చేయడమో చేస్తున్నారని చెప్పారు. ప్రపంచ కంపెనీలు హైదరాబాద్ కు క్యూ కడుతున్నాయంటే ఆ ఘనత సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ లకే దక్కుతుందని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.

# టీఎస్ ఎడ్‌సెట్ 2023 షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, మార్చి04 (ప్రజామంటలు):** బీఎడ్ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఎడ్‌సెట్ 2023 షెడ్యూల్ విడుదలైంది. తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి, టీఎస్ ఎడ్‌సెట్ కన్వీనర్, మహాత్మాగాంధీ వర్సిటీ వీసీ సీహెచ్ గోపాల్ రెడ్డి కలిసి షెడ్యూల్‌ను విడుదల చేశారు. 6వ తేదీ నుంచి అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులు రూ. 500, ఇతర కేటగిరీల అభ్యర్థులు రూ. 700 చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ఏప్రిల్ 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రూ. 250 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 25 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 30వ తేదీన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఎడిట్ చేసుకోవచ్చు. మే 5 నుంచి ఎడ్‌సెట్ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయి. మే 18న ప్రవేశ పరీక్ష నిర్వహించి, 21న ప్రాథమిక కీ విడుదల చేయనున్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగులే కీలకం

- తెలంగాణ అస్తిత్వాన్ని నిలబెట్టిన ఘనత కూడా వారిదే
- డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి జగదీష్ రెడ్డి

**నల్లగొండ,మార్చి04 (ప్రజామంటలు):** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. విధి, విధానాలతో పాటు నిధులు విడుదల చేసేది రాష్ట్ర ప్రభుత్వం అయినప్పటికీ ఆచరణలో అమలుపరిచేది మాత్రం ప్రభుత్వ ఉద్యోగులే నని ఆయన స్పష్టం చేశారు. 75 సంవత్సరాలుగా తెలంగాణ అస్తిత్వాన్నీ నిలబెట్టిన ఘనత కుడా టీఎన్‌జీవోలకే దక్కిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజున యావత్ భారతదేశంలోనే రోల్ మోడల్‌గా నిలిచింది అంటే అందులో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ప్రధానంగా ఉందని ఆయన ప్రశంసించారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా టీఎన్‌జీవో నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను మంత్రి జగదీష్ రెడ్డి ఆవిష్కరించారు. వాటితో పాటుగా అంగన్‌వాడి టీచర్స్ అసోసియేషన్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌లను కూడా మంత్రి ఆవిష్కరిం చారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడారు. ప్రజల మదిలో తెలంగాణ పదాన్ని ఒక శ్వాసగా



మార్చింది టీఎన్‌జీవో ఉద్యోగులు అని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విఎ÷-లావాత్మక మార్పులు తెచ్చిందన్నారు. పట్టణాలకే ఆ మార్పులు పరిమితం చెయ్యకుండా చివరి అంచు వరకు తీసుకపోవడంలో ఉద్యోగులు అందించిన సహకారం మరిచిపోలేనిదని పేర్కొన్నారు. మోదీ మాయాజాలం బట్టబయలు అయిందన్నారు. అనుచరులకు ప్రభుత్వ సొమ్ము రూ. 19 లక్షల కోట్లు ధారాదత్తం చేయడమే ఇందుకు నిదర్శనం అని పేర్కొన్నారు. పేదోడిని కొట్టి పెద్దోడికి పె÷-టటె విధంగా మోదీ చర్యలు ఉన్నాయని ఆయన దుయ్యబట్టారు. అటువంటి మోదీ సర్కార్ తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలకు అవరోధాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు. రుణమాఫీ పథకం కింద రూ. 26 వేల కోట్లు, రైతుబంధు పథకం కింద రూ. 60 వేల కోట్లు,ఆసరా ఫించన్ల కింద రూ. 15 వేల కోట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఓర్వలేక పోతుందన్నారు. అది కేంద్రానికి కంటగింపుగా మారి కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు మంజూరు చేయకుండా అడ్డు పడుతుందని జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. సంపద సృష్టించాలి పేదలకు పంచాలి అన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం అయితే బ్యాంకులను ఒక్కటి చేయాలి.. ఎల్ఐసీని పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయాలన్నది ప్రధాని మోదీ సంకల్పం అని ఆయన విమర్శించారు. అటువంటి మోదీ పాలనలో మొట్టమొదలు నష్టపోయిందే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అని పేర్కొన్నారు. అటువంటి కేంద్ర ప్రభుత్వ చర్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందని మంత్రి జగదీష్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కాంచనపల్లి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేటితో ముగియనున్న సైఫ్ పోలీస్ కస్టడీ

- ఫోరెన్సిక్ నివేదికే కీలకం కానున్నట్లు వెల్లడి

**వరంగల్,మార్చి04 (ప్రజామంటలు):** కేఎంసీ పీజీ విద్యార్థిని డాక్టర్ ప్రీతి మృతి నిర్ధారణపై ఉత్కంఠ కొనసాగుతోంది. నిందితుడు డాక్టర్ సైఫ్ ను మూడు రోజులుగా విచారిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల వరకూ పోలీస్ కమిషనర్, మరికొందరు ఉన్నతాధికారుల సమక్ష్యంలో విచారణ కొనసాగింది. నేటితో సైఫ్ పోలీస్ కస్టడీ ముగియనుంది. కాగా, ప్రీతి చనిపోవడానికి సంబంధించిన నిర్ధారణ వ్యవహారంలో ఫోరెన్సిక్ నివేదిక పైనే ఆధారపడివుంది. ఫోరెన్సిక్ నివేదిక రావడానికి మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. హైదరాబాద్ ల్యాబ్, గాంధీ ఆస్పత్రి నుంచి వరంగల్ పోలీసులకు నివేదికలు ఇంకా అందలేదు. మొత్తం 44 చాట్స్ కు సంబంధించిన సాంకేతిక ఆధారాలపై పోలీసులు అవగాహనకు వచ్చినట్లు సమాచారం. పోలీసులు విచారణ వివరాలను పోల్చుకుంటూ మరో సారి సీన్ రీ చెక్ చేస్తున్నారు. డాక్టర్ సైఫ్ పారిపోవడానికి ఎందుకు ప్రయత్నించాడనే దానిపై ఆరా తీస్తున్నారు. సైఫ్ కు సహకరించిన వారి వివరాలను కూడా చార్జ్‌షీట్ లో పొందు పరుచే అవకాశం ఉంది. ఖచ్చితంగా హత్యే నని డాక్టర్ ప్రీతి బంధువులు వాదిస్తుండటంతో లోతుగా పోలీసులు విచారిస్తున్నారు. సైఫ్ నుంచి రాబట్టిన వివరాలకు సంబంధించి కేఎంసీ అధికారులతో పోలీసులు మరోసారి భేటీ కానున్నారు. కేఎంసీ ప్రిన్సిపల్ నుంచి నిందితుడు డాక్టర్ సైఫ్, ముతురాలు డాక్టర్ ప్రీతికి సంబంధిచిన లిఖిత పూర్వక వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ కేసులో సైఫ్ వ్యక్తిగత డాటాను అనాలిసిస్ చేస్తున్నారు. అయితే పోలీసుల విచారణలో నిందితుడు సైఫ్ సంచలన విషయాలు వెల్లడిస్తున్నాడని తెలుస్తోంది. సైఫ్ మొబైల్ ఫోన్ లో కీలక ఆధారాలు లభించాయి. అతనికి చెందిన ÷ఎక్ష-1907 స్కై బ్లూ బ్లూ ఫోన్ లో కీలక సాక్ష్యాలు ఉన్నాయిని తెలుస్తోంది. మొబైల్ నుంచి కేసులో కీలకమైన మొత్తం 17 చాట్స్ ను స్వాధీనం చేసుకుని విచారణాధికారి సరిపోల్చుతున్నాడు. ప్రీతి ఆత్మహత్యాయత్నం సమాచారం తెలుసుకుని సైఫ్ పారి పోయేందుకు ప్రయత్నించాడు. ఘటన జరిగిన రోజు పారి పోయేందుకు స్కెచ్ తోనే కేఎంసీ నుంచి బయటకు వచ్చాడు. హైదరాబాద్ కు పారి పోయేందుకు అంతా సిద్ధం చేసుకున్నాడు. సైఫ్ వరంగల్ రైల్వే స్టేషన్ కు పోతున్న క్రమంలో మట్టెవాడ పోలీసులు సమాచారం అందుకున్నారు. వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ వద్ద సైఫ్ ను పక్కా సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. డాక్టర్ ప్రీతిని టార్గెట్ చేయాలని తన సీనియర్



డాక్టర్ భార్గవ్ ను నిందితుడు సైఫ్ కోరినట్లు తెలుస్తోంది. ప్రీతిని టార్గెట్ చేయాలనే కోణంలో మరో కొత్త వ్యక్తిని సైఫ్ కోరినట్టు విచారణలో వెలుగు చూస్తున్నాయి. తన సహచర విద్యార్థిని మరో డాక్టర్ తో ప్రీతికి రెస్ట్ లెస్ గా డ్యూటీస్ వేయాలని నిందితుడు సైఫ్ కోరాడు. ఈ విచారణలో డాక్టర్ అనుష తో 8 చాట్స్, డాక్టర్ బార్గవి మేడం నుంచి 6 చాట్స్, నిందితుడు సైఫ్ నుంచి 3 చాట్స్ ను పోలీసులు సరి పోల్చుతున్నారు. పీఏసీ రిపోర్ట్ సహా, డాక్టర్ ప్రీతి ఎండీ కోర్సుకు పనికి రాదు అనే డాక్టర్ సైఫ్ బావనను ధ్రువీకరించే అన్ని సాక్షాలను రీ కన్ స్ట్రక్షన్ చేస్తున్నారు. మొబైల్ టెక్నిషియన్ మిలాన్ కుమార్ సహాయంతో డాటా అనాలసిస్ చేస్తున్నారు. పీఏసీ రిపోర్ట్ విషయంలో డాక్టర్ ప్రీతిని హేళన చేసినట్టు, కాల్స్, మెసేజ్ లు డాక్టర్ సైఫ్ ఫోన్ డాటా నుంచి అనాల్సిస్ చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

# భవిష్యత్‌ను అంధకారంలో పడేస్తునన జగన్

- సైకో పాలన వేధింపులు తాళలేక ఆత్మహత్యలు
- వైసీపీ శ్రేణుల చేతిలో గాయపడ్డ మునిరాజమ్మ
- ఆర్థిక సాయం ప్రకటించిన చంద్రబాబు

**అమరావతి,మార్చి04 (ప్రజామంటలు):** భవిష్యత్‌ను అంధకారం చేసే పనిలో వైసీపీ ప్రభుత్వం ఉందని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. దళిత డ్రైవర్‌ను చంపి అంత్యక్రియలు చేసుకోమనడం అహంకారమని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ అవినీతి, వైఫల్యాలను ప్రశ్నిస్తే దాడులు, అక్రమ కేసులు, హత్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. డా.సుధాకర్‌ను మానసికంగా వేధించి అతని చావుకు కారణమయ్యారని చంద్రబాబు ఆవేద వ్యక్తం చేశారు. సైకో పాలన వేధింపులు తాళలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరినీ మాట్లాడనివ్వం, మాకు నచ్చినట్లు చేస్తాం అనే ధోరణితో వైసీపీ నేతలు పేట్రేగిపోతున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. టీడీపీ లీగల్ సెల్ పటిష్ఠంగా ఉందన్నారు. మత కలహాలు, రౌడీ, గూండాయిజం, ఫ్యాక్షనిజాన్ని రూపుమాపామన్నారు. సైకో నాయకుడు అనేకమంది సైకోలను తయారు చేశారని విమర్శించారు. జగన్ పాలనలో గంజాయి, డ్రగ్స్‌కు రాష్ట్రం అడ్డాగా మారిందన్నారు. 34 రోజుల యువగళంలో 12 కేసులు పెట్టారని మండిపడ్డారు. జగన్ పాదయాత్రను తాను అడ్డుకుని ఉంటే ఒక్క అడుగైనా వేసేవారా? అని చంద్రబాబు ప్రశ్నించారు. మన ప్రాథమిక హక్కులను మనమే కాపాడుకోవాలని ఆయన సూచించారు. అందుకు పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. పొలిటికల్ రౌడీయిజాన్ని భూస్థాపితం చేస్తామన్నారు. ఏకపక్షంగా వ్యవహరించే అధికారులను బోనెక్కిస్తానని సవాల్ విసిరారు. వైసీపీ శ్రేణుల చేతిలో గాయపడ్డ మునిరాజమ్మ అధినేత చంద్రబాబు ఆర్థిక సాయం ప్రకటించారు. పార్టీ కార్యాలయంలో చంద్రబాబును కలిశారు. మునిరాజమ్మకు చంద్రబాబు రూ.5 లక్షల సాయం ప్రకటించారు. కొద్దిరోజుల క్రితం శ్రీకాళహస్తిలో నారా లోకేష్‌కు మునిరాజమ్మ తన బాధలు చెప్పుకుంది. ఆమె హోటల్‌పై దాడులకు వైసీపీ శ్రేణులు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేసింది. ధైర్యంగా ఉండాలని, అక్రమ కేసులు, వైసీపీ బెదిరింపులకు భయపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని మునిరాజమ్మకు చంద్రబాబు భరోసా ఇచ్చారు. నాటి దాడి ఘటన వివరాలను, తన కుటుంబాన్ని ఊరు వదిలి వెళ్లమని వైసీపీ నేతలు బెదిరించిన విషయాన్ని, వేధింపులను మునిరాజమ్మ.. చంద్రబాబుకు వివరించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లలతో చిన్న హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న తనపై వైసీపీ నేతల దాడిని మునిరాజమ్మ చంద్రబాబుకు వివరించారు. అమె బాధలు విన్న చంద్రబాబు మునిరాజమ్మకు రూ.5 లక్షల రూపాయాల ఆర్థిక సాయం ప్రకటించారు. ఇదిలా ఉండగా...



వైసీపీ ప్రభుత్వంపై టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. నా సొంత నియోజకవర్గం కుప్పంలో తనను అడ్డుకున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మనల్ని అడ్డుకుంటారు, అరెస్ట్ చేస్తారు. కేసులు పెడతారు. కొంతకాలానికి వదిలిపెడతారు. వైసీపీ ప్రభుత్వం ఇంతకన్నా చేసేదేమీ లేదు' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఇవాళ టీడీపీ లీగల్ సెల్ రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు టీడీపీ అధినేత చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసులు, దాడులతో టీడీపీని భయపెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తన పర్యటనలను అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే 41(ఏ) నోటీసు ఇవ్వకుండా అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు.

# దేశమంతా బిజెపి వ్యతిరేక పవనాలు

**ఎన్సీపీ అధినేత శరద్ పవార్ వ్యాఖ్య**

**ముంబై,మార్చి04 (ప్రజామంటలు):** దేశమంతటా మార్పు గాలులు వీస్తున్నాయని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని రాజకీయ కురువృద్ధుడు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరద్‌పవార్ వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలోని పుణె నగరంలోగల కస్బా పెత్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీకి కంచుకోట. గత 28 ఏండ్లుగా బీజేపీ అక్కడ విజయం సాధిస్తూ వస్తున్నది. అయితే, ఇటీవల ఆ నియోజకవర్గానికి



జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఘోరం పరాజయం మూటగట్టుకుంది. అక్కడ ప్రతిపక్ష మహాకూటమి బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించాడు. ఈ విషయంపై మీడియా ప్రతినిధులు శరద్‌పవార్‌ను ప్రశ్నించగా.. దేశమంతా బీజేపీకి వ్యతిరేకంగా మార్పు గాలులు వీస్తున్నాయనడానికి కంచుకోట లాంటి కస్బా పెత్‌లో ఆ పార్టీ ఓటమే నిదర్శనమని అన్నారు. ఈ ఫలితంతో ప్రజలు మార్పు కోరుకుంటున్నారనే విషయం స్పష్టమైందని చెప్పారు. కాగా, ప్రస్తుతం పుణె పార్లమెంట్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న గిరీష్ బపట్.. కస్బా పెత్ అసెంబ్లీ స్థానంలో 2019 వరకు వరుసగా ఐదు పర్యాయాలు గెలుపొందారు. దేశవ్యాప్తంగా కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఆ అన్ని రాష్ట్రాలను బీజేపీ నిర్లక్ష్యం చేసిందని పవార్ ఆరోపించారు. అంతేగాక వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను బీజేపీ ఎలా కూలదోసిందో కూడా ప్రజలు గమనించారని, అవన్నీ దృష్టిలో ఉంచుకుని ప్రజలు బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేయబోతున్నారని అన్నారు.

# ముగిసిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్

**రూ. 1.17 లక్షల కోట్ల విలువైన 260 ఎంఓయూలపై సంతకాలు**

**విశాఖపట్టణం,మార్చి04 (ప్రజామంటలు):** ఏపీలో రెండు రోజుల పాటు జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023 ముగిసింది. ఈ రెండు రోజుల సదస్సులో రాష్ట్రంతో 352 అవగాహన ఒప్పందాలు కుదిరాయి. రెండో రోజు రూ. 1.17 లక్షల కోట్ల విలువైన 260 ఎంఓయూలపై సంతకాలు.. మొదటి రోజున, ఏపీ ప్రభుత్వం ? 11,87,756 లక్షల కోట్ల విలువైన 92




అవగాహన ఒప్పందాలపై సంతకం చేసింది. వీటి వల్ల రాష్ట్రానికి రూ.13,05,663 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దాదాపు 6 లక్షల 3 వేల 223 మందికి ఉపాధి అవకాశాలు దక్కినట్లయ్యింది. మొత్తం పెట్టుబడుల్లో ఒక్క ఎనర్జీ రంగంలోనే రూ.8,84,823 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీని వల్ల లక్షా 90 వేలకు పైగా ఉద్యోగాలు రానున్నాయి. పర్యాటక రంగంలో 22 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు ఏపీకి వచ్చాయి. ఐటీ రంగంలో 56, టూరిజంలో 117 ఎంఓయూలు జరిగాయి. ప్రధాన పెట్టుబడిదారులలో, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ రూ.2,35,000 కోట్ల పెట్టుబడితో 77,000 మందికి ఉపాధి కల్పించే 3 అవగాహన ఒప్పందాలపై సంతకం చేసింది.



## మామా మశ్చీంద్ర నుంచి
# మరో లుక్ విడుదల

హిట్ కొట్టి చాలా కాలం అవడంతో హీరో సుధీర్ బాబు మంచి హిట్ సినిమా కోసం ఎదురు చూస్తున్నాడు. నటుడు రైటర్ హర్షవర్ధన్ దర్శకత్వంలో ప్రస్తుతం మామా మశ్చీంద్ర అనే సినిమా తెరకెక్కుతోంది. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పీ బ్యానర్ మీద ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఈ సినిమా మీద ఒక్కసారిగా ఆసక్తి పెరిగిపోయింది దానికి కారణం ఈ సినిమాలో సుధీర్ బాబు మూడు పాత్రలో నటిస్తున్నారని క్లారిటీ ఇవ్వడమే గాక మూడు పాత్రలు మూడు భిన్నమైన విధంగా ఉండేటట్లు ప్లాన్ చేసినట్లుగా గతంలో రిలీజ్ చేసిన పోస్టుల ద్వారా క్లారిటీ వచ్చింది. ఇప్పటికే దుర్గ అనే ఒక ఊబకాయంతో బాధపడుతున్న వ్యక్తి పోస్టర్ షేర్ చేయగా ఇప్పుడు మరో పోస్టర్ షేర్ చేశారు. ఈ సినిమాకు చాలా రోజుల క్రితమే 'మామా మశ్చీంద్ర' అనే టైటిల్ ఖరారు చేశారు. ఇక ఈ సినిమాలో సుధీర్ బాబు నటిస్తున్న మూడు పాత్రలు విభిన్నంగా ఉండబోతున్నాయి. దుర్గా డీజే పరశు రాం పాత్రలలో ఆయన కనిపిస్తూ ఉండగా దుర్గ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ కొద్ది రోజుల క్రితం రిలీజ్ కాగా తాజాగా పరశు రామ్ లుక్ విడుదలైంది. ఇక డీజే పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ ఏడవ తేదీ రిలీజ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దుర్గా పాత్రలో సుధీర్ బాబు చాలా లావుగా కనిపించగా ఇప్పుడు పరశు రామ్ పాత్రలో సాల్ట్ అండ్ పెప్పర్ లుక్ లో కనిపిస్తున్నాడు. ఇక ఈ సినిమాను తెలుగుతో పాటు హిందీలో కూడా విడుదల చేయబోతున్నారు. సుధీర్ బాబు గతంలో జాకీ ష్రాఫ్ తనయుడు టైగర్ ష్రాఫ్ హీరోగా నటించిన 'బాఘీ'లో విలన్ గా నటించి అక్కడి ప్రేక్షకులకు సైతం దగ్గరైన క్రమంలో 'మామా మశ్చీంద్ర'ను హిందీలోనూ విడుదల చేయాలని ప్రొడ్యూసర్స్ నిర్ణయించారు.



## సిటాడెల్ వెబ్ సిరీస్‌లో
# సమంత కీలక రోల్

సమంత రూత్ ప్రభు ఈ మధ్యకాలంలో మళ్లీ వార్తల్లోకి వస్తుంది. అప్పుడెప్పుడో తన భర్త నాగచైతన్యతో విడాకులు తీసుకుంటున్నానని ప్రకటించినప్పటి నుంచి సమంత గురించి పెద్ద ఎత్తున మీడియాలో సోషల్ మీడియాలో చర్చ జరిగింది. సోషల్ మీడియాలో సమంత ఎలాంటి పోస్ట్ పెట్టినా అది వెంటనే వైరల్ అవుతూ ఉండేది. పెద్ద ఎత్తున మీడియా కవరేజ్ కూడా లభిస్తూ ఉండేది. ఇక ఈ మధ్య యశోద సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న ఆమె తాను మయోసైటిస్ అనే వ్యాధితో బాధపడుతు న్నానంటూ ప్రకటించి ఒక్కసారిగా కలకలం రేపింది. అయితే ఇప్పుడిప్పుడే సమంత తన అనారోగ్యం నుంచి కోలుకుంటుంది. నిజానికి ఒకప్పుడు తెలుగు సినీ పరిశ్రమకే పరిమితమైన ఆమె... రాజ్ డీకే దర్శకత్వంలో తెరకెక్కిన ఫ్యామిలీ మాన్ 2 లో నటించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. మరోసారి రాజ్ డీకే దర్శకత్వంలో సిటాడెల్ వెబ్ సిరీస్ ఇండియన్ ఎడాప్షన్ లో నటిస్తుంది. ఇందులో సమంత వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇక ఈ సీరీస్ లో ఆమె పాత్ర గురించి దర్శకులు తాజాగా వెల్లడించారు. సిటాడెల్లో సమంత పాత్ర కోసం తాము సమంత ఫుల్ కెపాసిటీ ఉపయోగించబోతున్నామని మరిన్నింటి కోసం ఆమెను సవాలు చేస్తామని కూడా పేర్కొన్నారు. ఇక ఆమె హై-ఓల్టేజ్ యాక్షన్ సన్నివేశాలలో నటిస్తుందని ఆమె పాత్ర కఠినమైనదని పేర్కొన్నారు. ఇక సమంత ఇప్పటికే సిటాడెల్ కోసం తన మేకోవర్ ను కొన్ని గ్లింప్స్ ను సోషల్ మీడియా ద్వారా పంచుకుంటుంది. ఇంటర్నేషనల్ సిరీస్ సిటాడెల్ లో ప్రియాంక చోప్రా జోనాస్ పోషిస్తున్న పాత్రనే ఇక్కడ సమంత పోషిస్తోంది. ఇక సమంత నటిస్తున్న శాకుంతలం సినిమా మొదట 2022 నవంబర్ 4న వెండితెరపైకి రాబోతుందని ప్రకటించారు చిత్ర దర్శక నిర్మాతలు. అయితే ఈ సినిమా అనేక సార్లు వాయిదా పాడగా ఎట్టకేలకు ఏప్రిల్ 14న వస్తున్నట్లు తెలిపుతూ ఓ పోస్టర్ను రిలీజ్ చేశారు.



# బలగం సినిమాపై కాపీ ముద్ర

### తన కథను కాపీ కొట్టారన్న రచయిత గడ్డం సతీష్

మార్చి మూడో తేదీన దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ నుంచి బలగం అనే సినిమా విడుదలైంది. కమెడియన్ వేణు దర్శకుడిగా మారి తెరకెక్కించిన ఈ సినిమాను మీద ముందు నుంచి దిల్ రాజు గట్టిగా ప్రమోట్ చేస్తూ వచ్చాడు. తన సొంత ఊరైన నిజామాబాదులో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించడం తర్వాత ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించి కేటీఆర్ని ముఖ్యఅతిథిగా పిలవడం దగ్గర నుంచి సినిమా విడుదలకు రెండు రోజులు ముందు నుంచే మీడియాకి స్పెషల్ షోలు వేస్తూ సెలబ్రిటీలకు స్పెషల్ షోలు వేస్తూ సినిమా మీద ఆసక్తి పెంచే ప్రయత్నం చేశాడు. తెలంగాణ ప్రాంతానికి సంబంధించి ఒక వ్యక్తి చావు తర్వాత ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి? అనే ఒక లైన్ ఆధారంగా తీసుకుని ఈ సినిమా తెరకెక్కించారు. పిండాన్ని కాకి ముట్టకపోతే తెలంగాణ గ్రామాల్లో ఎలా చర్చించుకుంటారు? ఎలాంటి పుకార్లు మొదలవుతాయనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కించారు. ప్రియదర్శి కావ్య కళ్యాణ్ రామ్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాలో సుధాకర్ రెడ్డి కీలక పాత్రలో నటించాడు. ఈ సినిమా మీద ఇప్పుడు అనూహ్యంగా కాపీ మరకబడింది. ఈ సినిమా మొత్తాన్ని తాను రాసిన ఒక కథ ఆధారంగా తెరకెక్కించారు అంటూ రచయిత, జర్నలిస్ట్ గడ్డం సతీష్ ఆరోపిస్తున్నారు. తాను గతంలో రాసిన ఒక కథను ఆధారంగా చేసుకుని ఈ సినిమా తెరకెక్కించారని తనను ఒక మాట అడిగి సినిమా తీస్తే తనకి ఎలాంటి బాధ ఉండేది కాదని కానీ ఇప్పుడు తన కథను అక్రమంగా కాపీ కొట్టినట్లు అనిపిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. 2011లో తాను రాసిన 'పచ్చికి' కథను బలగం పేరుతో కాస్త చిన్న మార్పులు చేసి తెరకెక్కించారని అంటున్నారు. ఈ సినిమా విషయంలో తనకి క్రెడిట్ ఇవ్వకపోతే చట్టపరంగా ముందుకు వెళ్తానని గడ్డం సతీష్ హెచ్చరించారు.

# వరుణ్ తేజ్ సరసన మిస్ వరల్డ్

ముకుంద సినిమాతో ఎంట్రీ ఇచ్చి ఆరంభంలోనే వరుస హిట్లు అందుకున్న మెగా హీరో వరుణ్ తేజ్. కంచె, ఫిదా, అంతరిక్షం, ఎఫ్2, గద్దలకొండ గణేష్ చిత్రాలు అతనికి స్టార్ డమ్ తెచ్చిపెట్టాయి. కానీ, అదే జోరు కొనసాగించలేకపోయిన వరుణ్ ఇప్పుడు పరాజయాల్లో ఉన్నాడు. గతేడాది విడుదలైన గని, ఎఫ్3 రెండూ నిరాశ పరిచాయి. దాంతో, కథల ఎంపికపై వరుణ్ ఇప్పుడు జాగ్రత్తగా ఉంటున్నాడు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో 'గాండివధారి అర్జున' అనే చిత్రంలో నటిస్తున్న వరుణ్.. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మాణంలో శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాలో నటిస్తున్నాడు. బాలీవుడ్ సినిమాటోగ్రాఫర్, వీఎఫ్ఎక్స్ నిపుణుడు శక్తి ప్రతాప్ సింగ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. పాన్ ఇండియా చిత్రం కావడంతో ఆ స్థాయిలోనే తారాగణం ఉండేలా చూస్తున్నారు నిర్మాతలు. వరుణ్ తేజ్ సరసన హీరోయిన్ గా మాజీ మిస్ వరల్డ్ మానుషి చిల్లర్ ను ఎంపిక చేశారు. అక్షయ్ కుమార్ 'సామ్రాజ్ పృథ్వీరాజ్' చిత్రంతో మానుషి బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. కాగా, వాస్తవ సంఘటన ఆధారంగా వాయుసేనలో ఎదురయ్యే సవాళ్లను చూపించబోయే యాక్షన్ సినిమాలో వరుణ్ తేజ్ ఫైలట్‌గా కనిపిస్తాడు. హీరోయిన్ మానుషి రాడార్ ఆఫీసర్ పాత్ర పోషించనుంది. ఆమె పాత్రను తెలియజేస్తూ చిత్ర బృందం చిన్న టీజర్ ను కూడా విడుదల చేసింది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రానికి నందకుమార్ అబ్బినేని సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ ప్రారంభమైంది.



'చమ్కీల అంగీలేసి' అంటూ సాగే వెడ్డింగ్ సాంగ్ విడుదల నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'దసరా'. సుధాకర్ చెరుకూరి నిర్మాత. కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో మార్చి 30న సినిమా రిలీజ్ కానుంది. ఇప్పటికే ప్రమోషన్స్‌లో స్పీడ్ పెంచిన మేకర్స్.. రెండు పాటలు విడుదల చేయగా వాటికి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మూడో పాటకు ముహూర్తం పెట్టారు. మార్చి 8న 'చమ్కీల అంగీలేసి' అంటూ సాగే వెడ్డింగ్ సాంగ్‌ను రిలీజ్ చేయనున్నట్లు కొత్త పోస్టర్‌తో అనౌన్స్ చేశారు. ఇందులో నాని, కీర్తి సురేష్ స్కూటర్‌పై వెళ్తూ, వింటేజ్ లుక్‌లో కనిపిస్తున్న తీరు ఆకట్టుకుంది. దీక్షిత్ శెట్టి, సముద్రఖని, సాయి కుమార్, జరీనా వహాబ్ ఇతర ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంతోష్ నారాయణ్ సంగీతం అందించాడు.

# దసరా విడుదలకు సన్నాహాలు



# గ్రీన్ చాలెంజ్.. స్వీకరించిన నమ్రతా శిరోద్కర్

బీఆర్ఎస్ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్.. రాజకీయాల్లో కన్నా మొక్కలు నాటడంలోను, నాటించడంలోనే బిజీగా ఉంటారు. అప్పుడప్పుడూ సెలబ్రిటీలకు గ్రీన్ ఇండియా చాలెంజ్ లు విసురుతుంటారు. అలా ఎంతో మందితో మొక్కలు నాటించారు. తాజాగా ఈనెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు సెలబ్రిటీలు, రాజకీయ నేతలకు గ్రీన్ ఇండియా చాలెంజ్ ను ఎంపీ సంతోష్ విసిరారు. వీరిలో సినీ నటి, సూపర్ స్టార్ మహేశ్ బాబు భార్య నమ్రతా శిరోద్కర్ కూడా ఉన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ ను నమ్రత కూడా స్వీకరించారు. దీంతో ఆమెకు సంతోష్ కుమార్ ధన్యవాదాలు తెలియజేశారు. మన చుట్టూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించడంలో సహాయపడటానికి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రచారం చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు గ్రీన్ ఇండియా చాలెంజ్ కు తనను నామినేట్ చేసినందుకు ఎంపీ సంతోష్ కుమార్ కు నమ్రత ధన్యవాదాలు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు అందరూ మొక్కలు నాటాలని కోరుతున్నానని చెప్పారు.



# కమెడియన్ వేణుతో దిల్‌రాజు సాహసం

### గ్రామీణ నేపథ్యంలో బలగం సినిమా నిర్మాణం

చాలా సంవత్సరాల క్రితం కమెడియన్‌గా పరిచయం అయిన వేణుకు ప్రభాస్ నటించిన మున్నా సినిమా తో గుర్తింపు లభించింది. ఆ సినిమా తర్వాత అడపా దడపా సినిమాల్లో చేసిన వేణు జబర్దస్త్ కార్యక్రమం తో మరింత పాపులారిటీ సొంతం చేసుకున్నాడు. అయితే జబర్దస్త్ లో కొన్నాళ్లే కొనసాగిన వేణు ఇతర ఛానల్స్ లోని కామెడీ షో ల్లో సందడి చేశాడు. సినిమాల్లో చాలా అరుదుగా మాత్రమే కనిపిస్తూ వచ్చాడు.బుల్లి తెరకే పరిమితం అయ్యాడు అనుకుంటూ ఉండగా సడన్ గా బలంగా సినిమాతో వేణు ప్రేక్షకుల ముందుకు రావడం అందరిని ఆశ్చర్యపర్చింది. సినిమా షూటింగ్ మొత్తం పూర్తి అయ్యే వరకు పెద్దగా పబ్లిసిటీ చేయలేదు. దిల్‌రాజు ఈ సినిమాను నిర్మించడంతో ప్రకటన వచ్చిన వెంటనే ఆసక్తి క్రియేట్ అయ్యింది. కానీ కొందరు మాత్రం వేణు ఎలా తీసి ఉంటాడో అనే అనుమానాలు వ్యక్తం చేశారు.దర్శకత్వం పై పెద్దగా అనుభవం లేని వేణు ను దిల్ రాజు ఎలా నమ్మాడు.. ఎలాంటి కథ తో దిల్ రాజును ఒప్పించి ఉంటాడు అని చర్చించుకున్నారు. సినిమా విడుదల తర్వాత దిల్ రాజును అభినందించాల్సిందే అనిపిస్తుంది. ఇలాంటి కథలను నమ్మడం అంటే కచ్చితంగా సాహసమే. ఇలాంటి గ్రామీణ నేపథ్యం సినిమాలు గతంలో చాలానే వచ్చాయి. అయినా కూడా దిల్ రాజు బలగం సినిమా ను నిర్మించేందుకు ఒప్పుకోవడం గొప్ప విషయం.కథ గొప్పగా లేకున్నా కూడా ఆయన కథనం లో వచ్చే పాత్రలు మరియు వాటికి ప్రేక్షకులు కనెక్ట్ అయ్యే తీరును ముందుగానే ఊహించిఉంటాడు. అందుకే ఈ సినిమాను నిర్మించేందుకు ముందుకు వచ్చాడు. వేణు పై నమ్మకం కలిగి ఉంటుంది. దిల్ రాజు యొక్క ముందు చూపును అభినందించాల్సిందే.బలగం సినిమా కు మంచి పబ్లిసిటీ చేయడంతో పాటు మౌత్ టాక్ పాజిటివ్ గా రావడం తో మంచి కలెక్షన్స్ నమోదు అవుతున్నాయి. కమెడియన్ వేణు ఇంత సీరియస్ సినిమా ను ఇంత బాగా ఎలా తీయగలిగాడు అంటూ అంతా కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో బలగం సినిమాకు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో మంచి వసూళ్లు కూడా నమోదు అవుతున్నాయి. దర్శకుడిగా వేణు కు ఒక్క సారిగా స్టార్ డమ్ పెరిగింది. ముందు ముందు ఆయన నుండి మరిన్ని సినిమాలు పెద్ద సినిమాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com